PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 191, పేజీలు - 08
మంగళవారం, డిసెంబర్ 23, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## విద్యార్థులకు శుభవార్త

**- స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేస్తూ జీవో జారీ**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. ఎంతో కాలంగా నిలిచిపోయిన విద్యార్థుల ఉపకార వేతనాలు , ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం సోమవారం నాడు విడుదల చేసింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యవేక్షణలో ఆర్థిక శాఖ మొత్తం రూ. 365.75 కోట్ల నిధులను సంక్షేమ శాఖలకు విడుదల చేసింది. ఏ శాఖకు ఎంత కేటాయించారో ఇక్కడ తెలుసుకోండి. ఎస్సీ సంక్షేమ శాఖకు షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల ఉపకార వేతనాల కోసం అత్యధికంగా రూ. 191.63 కోట్లు

2లో..

## జీహెచ్ఎంసీ డీలిమిటేషన్‌కు
# మార్గం సుగమం

**- వార్డుల పునర్వ్యవస్థీకరణకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ల కొట్టివేత**
**- ఈ విషయంలో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పిన హైకోర్టు**
**- డివిజన్ల సంఖ్యను 150 నుంచి 300కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను 300 డివిజన్లను పెంచడంపై దాఖలైన 80 పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో జోక్యం చేసుకోలేమని తెలిపింది. అభ్యంతరాలు తెలిపేందుకు ఇచ్చిన గడువు ముగిసిందని హైకోర్టు గుర్తు చేసింది. దీంతో ప్రభుత్వం గ్రేటర్ ను 300 వార్డులుగా విభజించడానికి అడ్డంకులు తొలగిపోయినట్లయింది.

**- 27 మున్సిపాలిటీల విలీనం తర్వాత 300వార్డులకు జీహెచ్ఎంసీ**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిని విస్తరిస్తూ, వార్డుల సంఖ్యను 150 నుండి 300కు పెంచుతూ ప్రభుత్వం డీలిమిటేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ వార్డుల పునర్విభజన అశాస్త్రీయంగా ఉందంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. పిటిషన్లపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి, తొలుత 300 వార్డుల జనాభా వివరాలు, మ్యాప్‌లను 24 గంటల్లో పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని ఆదేశించారు. అయితే, దీనిపై ప్రభుత్వం అప్పీలుకు వెళ్లడంతో డివిజన్ బెంచ్ ఈ ఉత్తర్వులను పాక్షికంగా సవరించింది. కేవలం పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసిన వార్డులు ముఖ్యంగా వార్డు నెం. 104 – షా అలీ బండా, 134 – లంగర్ హౌజ్ వివరాలు మాత్రమే బహిర్గతం చేయాలని స్పష్టం చేసింది.

**- అనేక అభ్యంతరాలతో పిటిషన్లు - కొట్టేసిన హైకోర్టు**

వార్డుల విభజనపై ప్రజలు తమ అభ్యంతరాలను సమర్పించడానికి హైకోర్టు అదనపు సమయం కేటాయించింది.

2లో..

## కర్ణాటక నాయకత్వ మార్పుపై రాహుల్ గాంధీదే తుది నిర్ణయం

**- అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని స్పష్టీకరణ**




బెంగుళూరు (ప్రశ్న న్యూస్) కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరదించేలా సీఎం సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర సీఎం మార్పు రగడపై అగ్రనేత నేత రాహుల్ గాంధీ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికే తామంతా కట్టుబడి ఉంటామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన సొంతూరు మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం మార్పుపై మీడియా పదేపదే చర్చించడంపై సిద్ధరామయ్య అసహనం వ్యక్తం చేశారు. “ఈ విషయంపై ఇన్ని ప్రశ్నలు ఎందుకు? నేను ఇప్పటికే శాసనసభలో దీని గురించి మాట్లాడాను. మళ్ళీ చర్చ అనవసరం” అని అన్నారు. తాను పూర్తికాలం సీఎంగా కొనసాగుతానని ఇటీవల అసెంబ్లీ వేదికగా ప్రకటించిన సిద్ధరామయ్య, తాజా వ్యాఖ్యలతో బంతిని అధిష్ఠానం కోర్టులోకి నెట్టారు. గతవారం మంత్రి కేఎన్ రాజన్న, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో భేటీ అయిన విషయంపై

2లో..

## బెల్టు షాపుల కట్టడికి హర్యానా మోడల్‌పై అధ్యయనం

**- ఆబ్కారీ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**- ఆదాయం కాదు.. ఆరోగ్యకరమైన వృద్ధి సాధించాలని సూచన**
**- లాటరీ విధానం, రిటైలర్ మార్జిన్ పెంపుపై పునఃపరిశీలన**
**- ప్రతీ మద్యం బాటిల్ పైనా ప్రత్యేక గుర్తింపు నెంబర్ ఉండాలని ఆదేశం**



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో మద్యం విధానాన్ని వ్యాపారంలా చూడకుండా, ఆరోగ్యకరమైన వృద్ధి సాధించేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ఆదాయమే లక్ష్యంగా విధానాలు ఉండకూడదని, మద్యాన్ని కూడా ఒక ఉత్పత్తిలానే పరిగణించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం అనుసరిస్తున్న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు, అప్లికేషన్ ఫీజు, ఇంకా లిక్కర్ ఐడెంటిఫికేషన్ నెంబర్, రిటైలర్ మార్జిన్ పెంపు తదితర అంశాలపై మరింత కసరత్తు చేయాలని సూచించారు. బార్ ఏఆర్ఈటీ (అడిషనల్ రిటెయిల్ ఎక్సైజ్ టాక్స్) మినహాయింపు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని సీఎం నిర్దేశించారు. అక్రమ మద్యాన్ని అరికట్టడం, బెల్టు షాపుల నియంత్రణ, డిజిటలైజేషన్, పర్యావరణ పరిరక్షణకు

2లో..

## కేసీఆర్ స్టేట్స్‌మన్, రేవంత్ స్ట్రీట్ రౌడీ

**- హరీష్ రావు తీవ్ర విమర్శలు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేసీఆర్ లేవనెత్తిన ప్రాజెక్టుల అంశాలకు సమాధానం చెప్పలేక, రేవంత్ రెడ్డి తన చిట్ చాట్ రాజకీయాలతో తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని బీఆర్ఎస్ నేత హరీష్ రావు మండిపడ్డారు. కేసీఆర్ ఒక స్టేట్స్ మన్ లాగా రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడితే, రేవంత్ రెడ్డి ఒక స్ట్రీట్ రౌడీ లాగా అత్యంత హీనమైన భాషలో మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న తీరుపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్ నిర్వహించిన మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడారు. కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేస్తోందని హరీశ్ రావు ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి గతంలో కేసీఆర్ ప్రభుత్వం అన్ని అనుమతులు సాధిస్తే, ప్రస్తుత ప్రభుత్వం డీపీఆర్ వాపస్

2లో..

## మీరు తప్పు చేసినట్టు నాకు తెలిస్తే చూస్తూ ఊరుకోను

**- మంగళగిరిలో ‘పదవి-బాధ్యత’ సమావేశంలో జనసేన నేతలకు దిశానిర్దేశం**




అమరావతి (ప్రశ్న న్యూస్) నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నాయకులకు పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని తప్పుడు పనులు చేస్తే చూస్తూ ఊరుకోబోనని స్పష్టం చేశారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జనసేన నిర్వహించిన ‘పదవి-బాధ్యత’ సమావేశంలో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. “మీకు వచ్చిన పదవులను బాధ్యతగా నిర్వర్తించండి. రెండు చేతులు జోడించి కోరుకుంటున్నాను, అధికారాన్ని దుర్వినియోగం చేయకండి. మీరు తప్పు చేసినట్టు నాకు తెలిస్తే చూస్తూ ఊరుకోను” అని పవన్ తీవ్రంగా హెచ్చరించారు. ఓటమిలో కూడా పార్టీ కోసం బలంగా నిలబడినందువల్లే నేడు అందరికీ పదవులు దక్కాయని ఆయన గుర్తుచేశారు.
యువతకు సరైన వేదిక అందించాలనే ఉద్దేశంతోనే జనసేన పార్టీని స్థాపించానని పవన్ తెలిపారు. “కొత్త పంథాను నమ్ముకొని ఎంతోమంది యువకులు నక్సలైట్లుగా మారారు. సరైన ఐడియాలజీ లేకపోతే ఇబ్బందులు వస్తాయి. అందుకే సలసల మరిగే యువతకు జనసేన ఒక వేదిక కావాలని ఆకాంక్షించాను” అని వివరించారు. కాంగ్రెస్ నుంచి వైసీపీ

2లో..

## తెలంగాణను వణికిస్తున్న చలి

**- పలుచోట్ల సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రాన్ని చలిగాలులు వణికిస్తున్నాయి. సోమవారం పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లెలో 6.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను 17 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగా నమోదయ్యాయి. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 7, ఆదిలాబాద్ జిల్లా అర్లిలో 8.3, వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో

2లో..

## తోలు తీసే హక్కు ప్రజలకే ఉంది

**- కేసీఆర్ అసెంబ్లీకి వస్తే చర్చిస్తాం**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రయోజనాల కోసం తాము చేసే పనుల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని మొదట్నుంచీ కోరుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొనసాగుతున్న తమ ‘ప్రజా పాలన’కు ప్రజలే అండగా నిలుస్తున్నారని, అందుకే వరుసగా పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలు, ఉప ఎన్నికలతో పాటు సర్పంచ్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని పేర్కొన్నారు. అధిక స్థానాల్లో కాంగ్రెస్ బలపరిచిన వారే గెలుపొందారని చెప్పారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష నేతలు ఇటీవల చేస్తున్న ఘాటు వ్యాఖ్యలపై స్పందించారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ‘తోలు తీసే’ హక్కు కేవలం ప్రజలకు మాత్రమే ఉంటుందని పొన్నం ప్రభాకర్

2లో..

## హైదరాబాద్ లో ముగిసిన శీతాకాల విడిది

**- ఢిల్లీ పయనమైన రాష్ట్రపతి ముర్ము**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐదు రోజుల శీతాకాల విడిది సోమవారంతో ముగిసింది. ఈ సాయంత్రం హైదరాబాద్ పర్యటనను ముగించుకుని ఆమె ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు. హకీంపేట ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో తెలంగాణ

2లో..

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

**- ఐఏఎస్ లతో పాటు ఐపీఎస్‌లను మరోసారి విచారించిన సిట్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో భాగంగా గత ప్రభుత్వ హయాంలో అత్యున్నత పదవుల్లో కొనసాగిన ముగ్గురు ఐఏఎస్ అధికారులతో పాటు పలువురు ఐపీఎస్ అధికారులను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. ముఖ్యంగా మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు సోమేష్ కుమార్, శాంతి కుమారిలను సాక్షులుగా విచారించి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది. వీరితో పాటు సాధారణ పరిపాలన శాఖ మాజీ పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావును కూడా విచారించిన అధికారులు, అప్పట్లో ఫోన్ ట్యాపింగ్ నంబర్ల మంజూరు, అందుకు పరిపాలనాపరమైన అనుమతులపై ఆయన్ని ప్రశ్నించారు. మాజీ ఐఏఎస్ అధికారి సోమేశ్ కుమార్, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ఐపీఎస్ అధికారి నవీన్ చంద్రకు సిట్ నోటీసులు జారీ చేసింది.



**- ప్రభాకర్ రావును తిరిగి నియమించడంపై ఆరా తీసిన సిట్**

ఫోన్ టాపింగ్ కేసు విచారణలో ప్రధానంగా ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు నియామకం, ఆయన వ్యవహారశైలిపై సిట్ దృష్టి సారించింది. పదవీ విరమణ తర్వాత ప్రభాకర్ రావును

2లో..

# విద్యార్థులకు శుభవార్త

మంజూరు చేశారు. గిరిజన సంక్షేమ శాఖకు ఎస్టీ విద్యార్థుల అవసరాల నిమిత్తం రూ. 152.59 కోట్లు విడుదలయ్యాయి. బీసీ సంక్షేమ శాఖకు వెనుకబడిన తరగతుల విద్యార్థుల బకాయిల కోసం రూ. 21.62 కోట్లు కేటాయించారు. ఈ నిధుల విడుదలతో గత ప్రభుత్వం నుండి పెండింగ్‌లో ఉన్న మెజారిటీ బకాయిలు పరిష్కారమైనట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చాటుకున్నామన్నారు. రాష్ట్ర ఖజానాపై ఒత్తిడి ఉన్నప్పటికీ విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ నిధులను సర్దుబాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను తాము ప్రాధాన్యత క్రమంలో క్లియర్ చేస్తున్నామని వివరించారు. దీనివల్ల హాస్టల్లో ఉండేవారికి, కళాశాలల్లో చదివే పేద విద్యార్థులకు పెద్ద ఊరట లభించనుంది. ప్రభుత్వం నిధులు విడుదల చేయడమే కాకుండా.. విద్యా రంగంలో మౌలిక సదుపాయాల కల్పనపై కూడా దృష్టి పెట్టింది. హాస్టల్ విద్యార్థులకు అందించే భోజన వసతి, మెస్ చార్జీల విషయంలో కూడా ప్రభుత్వం త్వరలో సానుకూల నిర్ణయం తీసుకోనుంది. కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకుండా ఉండేందుకు ఈ బకాయిల విడుదల ఎంతో కీలకంగా మారనుంది. మంజూరైన నిధులు నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి లేదా సంబంధిత విద్యా సంస్థలకు జమ అయ్యేలా పారదర్శకమైన చర్యలు తీసుకుంటున్నారు.

# జీహెచ్‌ఎంసీ డీలిమిటేషన్‌కు మార్గం సుగమం

తొలుత డిసెంబర్ 17తో ముగియాల్సిన గడువును కోర్టు డిసెంబర్ 19 వరకు పొడిగించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ డీలిమిటేషన్ అనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇందులో కోర్టుల జోక్యం పరిమితంగా ఉండాలని వాదించారు. కేంద్ర సెన్సస్ కమిషనర్ ఆదేశాల ప్రకారం డిసెంబర్ 31, 2025 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉందని, అందుకే వేగంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశామని, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**- అన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామన్న ప్రభుత్వం**

డీలిమిటేషన్ పై ప్రభుత్వానికి చాలా అభ్యంతరాలు వచ్చాయి. ఒకే వార్డు రెండు, మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి వస్తోందని కొందరు ఫిర్యాదు చేశారు. కొన్ని వార్డుల్లో 18 వేల జనాభా ఉంటే, మరికొన్నింటిలో 70 వేల వరకు ఉండటంపై కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హయత్ నగర్ వంటి ప్రాంతాల్లో చారిత్రక కట్టడాలు ఒక వార్డులో, ఆ ప్రాంత పేరుతో ఉన్న మరో వార్డు వేరే చోట ఉండటంపై స్థానికులు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు అభ్యంతరాలను స్వీకరిస్తూనే, మరోవైపు కోర్టు కోరిన వార్డుల మ్యాప్‌లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. డిసెంబర్ 31లోగా తుది నివేదిక సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దానికి సంబంధించి కోర్టు వద్ద అడ్డంకులు అన్నీ తొలగిపోయినట్లయింది.

# కర్ణాటక నాయకత్వ మార్పుపై రాహుల్ గాంధీదే తుది నిర్ణయం

అడిగిన ప్రశ్నకు సిద్ధరామయ్య స్పందిస్తూ "డీకే శివకుమార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు. ఆయన్ను కలవడంలో తప్పేముంది?" అని ప్రశ్నించారు. మరోవైపు, సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య ఆధిపత్య పోరుపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు గుప్పిస్తోంది. కాంగ్రెస్ అధిష్ఠానానికి ఈ సమస్యను పరిష్కరించే సత్తా లేదని ఎద్దేవా చేస్తోంది. ఈ వారంలో డీకే శివకుమార్ ఢిల్లీ పర్యటనకు వెళ్లనుండటం, శనివారం జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి సిద్ధరామయ్యకు ఆహ్వానం అందే అవకాశం ఉండటంతో కర్ణాటక రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# బెల్టు షాపుల కట్టడికి హర్యానా మోడల్‌పై అధ్యయనం

సంబంధించి సంస్కరణలు తీసుకురావాల్సిందిగా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బెల్టు షాపుల నియంత్రణకు హర్యానా మోడల్‌పై అధ్యయనం చేయాలని నిర్దేశించారు. సచివాలయంలో సోమవారం నాడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దీనికి మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ప్రొహిబిషన్–ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ శ్రీధర్, ఎక్సైజ్ ఈడీ రాహుల్ దేవ్ శర్మ హాజరయ్యారు. కొత్త ఎక్సైజ్ విధానాల అమలు, వాటి ప్రభావంపై సమీక్షలో సమగ్రంగా చర్చించారు.

అనధికార విక్రయ కేంద్రాలుగా తయారైన బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. బెల్టు షాపులు పూర్తిస్థాయిలో కట్టడి చేయడానికి హర్యానాలో అనుసరించిన సబ్ లీజు విధానాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం గ్రామీణ, దూర ప్రాంతాల్లో షాపులు లేకపోవడం వల్ల బెల్ట్ షాపుల సమస్య నెలకొందని అధికారులు చెప్పారు. అలాగే, పర్యావరణ పరిరక్షణలో భాగంగా... మద్యం వినియోగం అనంతరం బాటిల్ తిరిగి ఇస్తే డీఆర్‌ఎస్ (డిపాజిట్ రిటర్న్ స్కీమ్) కింద నగదు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు.

**- పెరిగిన మద్యం విక్రయాలు**

అక్టోబర్ 2024 నుంచి అక్టోబర్ 2025 వరకు రూ.8,000 కోట్లు ఎక్సైజ్ ఆదాయం లక్ష్యం పెట్టుకోగా, రూ.7,041 కోట్లు ఆదాయం వచ్చినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 2025–26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 17 వరకు మద్యం విక్రయాల్లో 4.52 శాతం పెరుగుదల కనిపించిందని ఐఎంఎఫ్ఎల్ (ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్) విక్రయాలు 19.08 శాతం, బీర్ విక్రయాలు 94.93 శాతం పెరిగాయని అధికారులు వెల్లడించారు. ఈ డిసెంబర్ 18 నుంచి వచ్చే ఏడాది మార్చి నాటికి రూ.8,422 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసినట్టు అధికారులు తెలిపారు. మొత్తంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 3 శాతం పెరుగుదల చూపిస్తామని అధికారులు చెప్పారు.

**- 35 శాతం డిజిటల్ చెల్లింపులు**

మద్యం విక్రయాల్లో డిజిటల్ చెల్లింపులు 34.9 శాతం పెరిగాయని, కొన్ని జిల్లాల్లో 40%–%47 శాతం వరకు డిజిటల్ లావాదేవీలు నమోదైనట్టు వివరించారు. అయితే నగదు వినియోగాన్ని తగ్గించి డిజిటల్ చెల్లింపులు జరిగేలా అందరిలో అవగాహన పెంచాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం, అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రతి మద్యం బాటిల్‌కు ప్రత్యేక లిన్ (లిక్కర్ ఐడెంటిఫికేషన్ నెంబర్) త్వరితగతిన తీసుకురావాలని, సాధారణ ప్రజలు కూడా సులభంగా గుర్తించేలా ఉండాలన్నారు. లిన్‌లో బ్రాండ్, బ్యాచ్, లైన్‌తో పాటు తయారైన తేదీ, గంటలు, నిమిషాలు, సెకన్లు సహా వివరాలు ఉండాలన్నారు.

# కేసీఆర్ స్టేట్స్‌మన్, రేవంత్ స్ట్రీట్ రౌడీ

తెచ్చుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 45 టీఎంసీలు చాలు అని ఢిల్లీకి లేఖ ఎందుకు రాశారు ఇది పాలమూరు గొంతు కోయడం కాదా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం కల్వకుర్తి, భీమా, నెట్టంపాడు వంటి ప్రాజెక్టుల ద్వారా దాదాపు 10 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిందని, ఈ వాస్తవాన్ని అబద్ధాలతో కప్పిపుచ్చలేరని హితవు పలికారు. మహాలక్ష్మి పథకం కింద రూ. 2500, రైతు భరోసా, పెన్షన్ల పెంపు వంటి హామీలు ఏమయ్యాయని హరీశ్ రావు ప్రశ్నించారు. నిధుల సమీకరణలో అనుభవం ఉందని చెప్పుకునే రేవంత్ రెడ్డి, ఆ అనుభవాన్ని కేవలం లూటీలకు, దోపిడీలకు మాత్రమే వాడుతున్నారని విమర్శించారు. బడ్జెట్‌లో లక్షల ఎకరాలకు ఆయకట్టు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం, ఒక్క ఎకరాకైనా నీళ్లు ఇచ్చిందా అని సవాల్ విసిరారు. సాగర్ కుడి కాల్వ నుంచి ఏపీ ప్రభుత్వం రోజుకు 10 వేల క్యూసెక్కుల నీరు తరలిస్తుంటే, రేవంత్ సర్కారు చేష్టలుడిగి చూస్తోందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి రాజకీయ చరిత్ర అంతా వెన్నుపోట్లమయమని, చొక్కాలు మార్చినంత సులభంగా పార్టీలు మార్చే ఆయనకు నైతికత గురించి మాట్లాడే హక్కు లేదని హరీశ్ రావు అన్నారు.

50 కోట్లు పెట్టి పీసీసీ పదవి కొన్నవని మీ పార్టీ నేతలే చెప్పారు. ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్ గా దొరికిన దొంగవు నువ్వు అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రగతి గురించి టోనీ బ్లెయిర్ వంటి అంతర్జాతీయ ప్రతినిధులే ప్రశంసించారని, కానీ రేవంత్ మాత్రం రాజకీయాల కోసం రాష్ట్ర పరువు తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నీటి హక్కులను తాకట్టు పెట్టిన కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టేందుకు పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో సమావేశాలు నిర్వహిస్తామని హరీశ్ రావు ప్రకటించారు.

ఇప్పటికైనా 45 టీఎంసీలు చాలు అన్న లేఖను వెనక్కి తీసుకొని, 90 టీఎంసీల కోసం పోరాడాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జల ప్రయోజనాల విషయంలో కేసీఆర్ ఏనాడూ రాజీపడలేదని, రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి ద్రోహాన్ని ప్రజల ముందు ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు.

# మీరు తప్పు చేసినట్టు నాకు తెలిస్తే చూస్తూ ఊరుకోను

ఏర్పడినప్పుడు వారికి సిద్ధంగా కేడర్ వచ్చిందని, కానీ జనసేన మాత్రం ప్రతిదీ సొంతంగా నిర్మించుకోవాల్సి వచ్చిందని అన్నారు. జనసేన సిద్ధాంతం అందరినీ కలుపుకొనిపోయేదే తప్ప విడదీసేది కాదన్నారు. జాతీయ దృక్పథంతోనే తాను ప్రాంతీయ పార్టీని పెట్టానని స్పష్టం చేశారు. పర్యావరణాన్ని కాపాడుతూనే అభివృద్ధి జరగాలని, మనం చేసే ప్రతి పని రాజ్యాంగానికి లోబడే ఉండాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

# తెలంగాణను వణికిస్తున్న చలి

8.7, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 9.5, కామారెడ్డిలో 9.7 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, ఆదిలాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఏడు జిల్లాలకు కోల్డ్ వేవ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో డిసెంబర్ 26 వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 5 నుంచి 10 డిగ్రీల మధ్య ఉండే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్, వరంగల్‌తో సహా 15 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక్కడ ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల మధ్య ఉండొచ్చని అంచనా వేసింది. రానున్న 24 గంటల్లో హైదరాబాద్‌లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం వేళ పొగమంచు కురిసే అవకాశం ఉందని, గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 28, 13 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ బులెటిన్‌లో పేర్కొంది.

# తోలు తీసే హక్కు ప్రజలకే ఉంది

వ్యాఖ్యానించారు. ఇప్పటికే వరుస ఎన్నికల్లో ఓడించడం ద్వారా కేసీఆర్ నేతృత్వంలోని పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు.

**- అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ వచ్చి చర్చించాలి..**

సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానించినట్లుగా, కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు రావాలని, అక్కడ తమ ప్రభుత్వ వైఫల్యాలు ఏవైనా ఉంటే చర్చించాలని ప్రతిపక్షనేతకు సవాల్ విసిరారు. గత ప్రభుత్వం హాస్టల్ అద్దెలను పెండింగ్‌లో పెడితే తాము చెల్లించామని, గోదాముల్లో నడుస్తున్న పాఠశాలలకు సొంత భవనాలు నిర్మిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అని తాము చేస్తున్న ప్రజాహిత కార్యక్రమాలను వివరించారు. సొంత పార్టీ, కుటుంబ వ్యవహారాలపై కవిత చేస్తున్న వ్యాఖ్యలకు సమాధానం చెప్పలేక కేసీఆర్ విమర్శలు చేస్తున్నారని, దేశానికి వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా ప్రజలు సహించబోరని ఆయన స్పష్టం చేశారు.

**- కిషన్ రెడ్డి తెలంగాణకు ఏం చేశారు.. లేఖ రాయాలి**

కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంపై కూడా మంత్రి తీవ్రంగా ధ్వజమెత్తారు. గడచిన 12 ఏళ్లుగా కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి తెలంగాణకు ఏం చేశారో లేఖ రాయాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందో చెప్పాలని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ వద్ద కిషన్ రెడ్డి చివాట్లు తిన్నారని వార్తలు వస్తున్నాయని, కేసీఆర్ మెప్పు కోసమే ఆయన లేఖలు రాస్తున్నారా అని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణకు న్యాయంగా రావాల్సిన నిధులు, వాటాల కోసం బీజేపీ మరియు స్థానిక ప్రతిపక్షాలు ఎందుకు పోరాడటం లేదని, ప్రజలకు అన్యాయం చేస్తే వారు చూస్తూ ఊరుకోరని పొన్నం ప్రభకర్ హెచ్చరించారు.

**- మోదీ పుట్టకముందే కాంగ్రెస్ పార్టీ ఉంది**

కాంగ్రెస్ పార్టీ చారిత్రక నేపథ్యాన్ని గుర్తు చేస్తూ, నరేంద్ర మోదీ పుట్టక ముందే స్వాతంత్ర్యం కోసం ఎందరో నేతలు ప్రాణాలు అర్పించిన పార్టీ కాంగ్రెస్ అని పొన్నం ప్రభాకర్ అన్నారు. దివంగత ప్రధానులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ వంటి మహనీయుల పేర్లు కనిపించకుండా చేయాలని కేంద్రం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మహాత్మా గాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ పథకానికి గాడ్సే పేరు పెట్టే ప్రయత్నం చేయడం దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించడమేనని మండిపడ్డారు.

# హైదరాబాద్ లో ముగిసిన శీతాకాల విడిది

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, డీజీపీ బి. శివధర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నత స్థాయి సివిల్, రక్షణ శాఖ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రపతి ప్రయాణం సందర్భంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నుంచి హకీంపేట ఎయిర్‌బేస్ వరకు పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, పలుచోట్ల ట్రాఫిక్‌ను మళ్లించారు. శీతాకాల విడిది కోసం డిసెంబర్ 17న హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి, బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె పలు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డిసెంబర్ 19న రామోజీ ఫిల్మ్ సిటీలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్‌ల జాతీయ సదస్సును ప్రారంభించారు. 20న బ్రహ్మకుమారీల శాంతి సరోవర్ 21వ వార్షికోత్సవ సభలో ప్రసంగించారు. 21న రాష్ట్రపతి నిలయంలో 'ఎట్ హోమ్' విందును ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా రాష్ట్రపతి శీతాకాల విడిది కోసం హైదరాబాద్ రావడం ఆనవాయితీ. ఈ సమయంలో రాష్ట్రపతి నిలయం నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారు. 1860లో నిర్మించిన ఈ భవనం, 1948లో హైదరాబాద్ భారత్‌లో విలీనమైన తర్వాత రాష్ట్రపతి విడిది కేంద్రంగా మారింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

ఎస్ఐబీలో ఓఎస్‌డీగా నియమించడం వెనుక ఉన్న కారణాలను, ఆ ప్రక్రియలో ఐఏఎస్ అధికారుల పాత్రను అధికారులు లోతుగా ఆరా తీశారు. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధులు సినీ ప్రముఖుల ఫోన్లను ప్రభాకర్ రావు ట్యాప్ చేసినట్లు వచ్చిన ఆరోపణలతో, ఆయన సూచించిన నంబర్లను ఎలాంటి పరిశీలన లేకుండా హోం శాఖకు పంపడంపై మాజీ ఐపీఎస్ అధికారుల నుంచి వివరాలు సేకరించారు. మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చందును కూడా విచారించి, నాటి ఫోన్ ట్యాపింగ్ కార్యకలాపాల్లో ఇంటెలిజెన్స్ విభాగం సమన్వయంపై స్పష్టత కోరారు. గత ప్రభుత్వంలో అత్యంత కీలకంగా పనిచేసిన ఈ అధికారులందరినీ సాక్షులుగా పరిగణిస్తూ, వారి వాంగ్మూలాల ఆధారంగా కేసులో మరిన్ని లోతైన విషయాలను వెలికితీసేందుకు సిట్ ప్రయత్నిస్తోంది. ప్రభాకర్ రావు ఇచ్చిన నంబర్ల జాబితాను ఉన్నతాధికారులు యథావిధిగా ముందుకు పంపడం వెనుక ఉన్న ఒత్తిళ్లు లేదా ఉద్దేశపూర్వక సహకారంపై సిట్ తన దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ విచారణ ప్రక్రియ ముగిసిన అనంతరం సేకరించిన స్టేట్‌మెంట్లను అనుబంధ ఛార్జ్‌షీట్‌లో చేర్చడం ద్వారా ఈ కేసును మరింత పటిష్టం చేయాలని సిట్ అధికారులు భావిస్తున్నారు.

# ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి

**చాగలమర్రి** చాగలమర్రి మండలం లోని అజీం బ్రిలియంట్ ఉన్నత పాఠశాల నందు ఘనంగా శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. డిసెంబర్ 22 వ తేదీ 1827 వ సంవత్సరంలో రామానుజన్ గారు జన్మించారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచి ఆయిలర్ నియమాలు, త్రికోణమితికి సంబంధించిన సమస్యలను సాధించారు. గణిత ఉపాధ్యాయులు ఫారుక్ గారు మాట్లాడుతూ, 20 వ శతాబ్దపు ప్రపంచ ప్రసిద్ధి గాంచిన గణిత మేధావుల్లో ఒక్కరిగా పేరు సంపాదించిన భారతీయుడు మన శ్రీనివాస రామానుజన్. ఈయన "సినాప్సిస్ ఆఫ్ ప్యూర్ మాథమాటిక్స్" అనే పుస్తకం రామానుజన్ ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసింది. మన దేశ గొప్పతనాన్ని చాటి చెప్పిన రామానుజన్ అనారోగ్య కారణాలతో తన 33 వ యేట మరణించాడు . గణిత శాస్త్రంలో రామానుజన్ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించింది అని విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు గణిత శాస్త్రవేత్తల చిత్ర పటాలను ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు శ్రీనివాస రామానుజన్ గొప్పదనం గురించి వివరించారు.





# రోడ్డు ప్రమాదం..

## ఎదురెదురుగా ఢీకొన్న లారీలు

గజ్వేల్, : తెల్లవారుజామున కురుస్తున్న దట్టమైన పొగ మంచు రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతుంది. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం న్యామతబాద్ శివారులో సోమవారం రెండు లారీలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. అల్లాదుర్గం– మెటల్ కుంట రోడ్డులో రాయికోడు వైపు వెళ్తున్న చెరుకు లారీ, వరిపొట్టు లోడుతో గంగ్వార్ వస్తున్న లారీలు ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్లు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్లో మిర్జాపూర్(బి) ఆసుపత్రికి తరలించారు.

# పాముకాటుతో బాలిక మృతి

నర్సాపూర్, : పాముకాటుతో బాలిక మృతిచెందిన ఘటన చేగుంట మండలం రెడ్డిపల్లి కాలనీలో శనివారం అర్ధరాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. బి.గంగాధర్ కుటుంబ సభ్యులతో కలిసి రెడ్డిపల్లి కాలనీ వద్ద 44వ జాతీయ రహదారి పక్కన రేకుల షెడ్డు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేస్తుంటారు. పదో తరగతి వరకు చదివి మానేసిన ఆయన కూతురు అక్షయ(16) తల్లిదండ్రులతో కలిసి రాత్రి భోజనం చేసి పడుకుంది. ఉదయం తల్లిదండ్రులు ఆమె లేపగా ఎంతకీ లేవలేదు. దీంతో స్థానికులను పిలవడంతో వారు వచ్చి చూశారు. రాత్రి గుర్తుతెలియని పాము కరవడంతో మృతి చెంది ఉంటుందని వారు అనుమానం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులను సర్పంచి నర్సింహా పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

## కొత్త సర్పంచుల ప్రమాణ స్వీకారం: గ్రామాల్లో సందడి



గద్వాల, : తెలంగాణ రాష్ట్రంలో కొత్త సర్పంచులు, వార్డ్ మెంబర్లు, ఉప సర్పంచులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. జోగులాంబ గద్వాల జిల్లా, గద్వాల్లోని ఇర్కిచేడు గ్రామంలో సర్పంచ్ ఆంజనేయులు బాధ్యతలు చేపట్టారు. గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ కార్యదర్శులు తమపై భారం తగ్గుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## గొలపల్లిలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

మక్తల్, : నారాయణపేట జిల్లా మక్తల్ మండలం గొలపల్లి గ్రామంలో నూతన పాలకవర్గం కొలువుదీరింది. అధికారులు నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గ్రామ పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు, ఇతర అధికారులు నూతన పాలకవర్గాన్ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి అన్ని విధాల పాటుపడతామని నూతన పాలకవర్గం తెలిపింది.

# కళ్లకు గంతలతో గణిత మాయ: అనంతప్ప యాదవ్ అద్భుత ప్రదర్శన

వనపర్తి, : వనపర్తి పట్టణంలోని మాస్టర్ మైండ్ హై స్కూల్లో డిసెంబర్ 22న ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కళ్లకు గంతలతో గణిత అవధానం కార్యక్రమం జరిగింది. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ అనంతప్ప యాదవ్ విద్యార్థులకు గణితంపై ఆసక్తిని పెంచే మెలకువలు నేర్పించారు. మెమరీ శతావధానంలో భాగంగా, 1 నుంచి 100 వరకు అంకెలను వివిధ పేర్లతో అనుసంధానించి, కళ్లకు గంతలు కట్టుకొని ఆరోహణ, అవరోహణ క్రమాల్లో వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. మాయ కూడిక ద్వారా గణితాన్ని సులభంగా నేర్చుకునే విధానాన్ని కూడా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం. గౌతమ్ కుమార్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## బాధ్యతలకు సిద్ధం.. నిధులొస్తేనే అభివృద్ధి పథం

మహబూబ్నగర్, : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంచాయతీ పాలకవర్గాలు కొలువుదీరనున్నాయి. అభివృద్ధి, కొత్త పాలకులపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయితే పంచాయతీల ఖజానా ఖాళీగా ఉండటంతో పనులెలా చేయాలని ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే గత సర్పంచులు చేసిన పనులకు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.180 కోట్ల మేర బిల్లులు పెండింగ్లో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులతో పాటు సాధారణ, ఉపాధి హామీ పథకం, పన్నుల వసూలు తదితర నిధులే పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు. ఉద్యోగుల జీతభత్యాలకు 30 శాతం, పారిశుద్ధ్యం వీధిదీపాలకు, మంచినీరు తదితర వాటికి 15 శాతం చొప్పున రహదారులు, కాల్వలకు 20 శాతం, ఇతర అవసరాలకు 10 శాతం చొప్పున నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.

# అంగన్వాడీల్లో నిర్లక్ష్యం: ఏఓకు వినతి పత్రం



నిజామాబాద్ రూరల్,: తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ గారు అందుబాటులో లేనందున, ఏఓ గారికి మెమోరాండం అందజేశారు. నగర అధ్యక్షుడు అఖిల్ మాట్లాడుతూ, జిల్లాలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనం అందడం లేదని, కొన్ని కేంద్రాల్లో నాణ్యత లేని గుడ్లు, కూరగాయలు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. మరికొన్ని కేంద్రాల్లో నిధులు వచ్చినా భోజనం అందించడం లేదని, ఇది ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో తీవ్ర నిర్లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రాన్ని అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, ఈ సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేష్, సుజిత్ పాల్గొన్నారు.

## నారాయణపూర్ గ్రామ సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం చేసిన హరి పుష్పలత, అశోక్



**కోహెడ** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నారాయణపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్‌గా ఎన్నికైన హరి పుష్పలత, అశోక్ మరియు ఉప సర్పంచ్ మరియు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలక మండలికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం సర్పంచ్ హరి పుష్పలత, అశోక్ మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. త్రాగునీటి సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల అభివృద్ధి, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, వార్డు సభ్యుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో పారదర్శక పాలన అమలు చేస్తూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే పాలక వ్యవస్థను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి,కారోబార్, గ్రామపంచాయతీ సిబ్బంది. ప్రజా ప్రతినిధులు, యువత, మహిళలు పాల్గొని నూతన పాలక మండలికి అభినందనలు తెలిపారు.

## కోహెడ గ్రామ సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన బందెల సుజాత, బాలకిషన్



**కోహెడ** సిద్దిపేట జిల్లా కోహెడ మండలం కోహెడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్‌గా ఎన్నికైన బందెల సుజాత, బాలకిషన్ మరియు ఉప సర్పంచ్ కందాల వెంకటేష్, మరియు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన పాలక మండలికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం సర్పంచ్ బందెల సుజాత, బాలకిషన్ మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. త్రాగునీటి సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల అభివృద్ధి, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. అలాగే గ్రామ ప్రజల సమస్యలను వెంటనే గుర్తించి, వార్డు సభ్యుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో పారదర్శక పాలన అమలు చేస్తూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే పాలక వ్యవస్థను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ చంద్రశేఖర్, గ్రామ కార్యదర్శి మాధురి, కారోబార్ తలారి అనిల్, గ్రామపంచాయతీ సిబ్బంది. ప్రజా ప్రతినిధులు, యువత, మహిళలు పాల్గొని నూతన పాలక మండలికి అభినందనలు తెలిపారు.

## పారదర్శక పాలనకు ప్రత్యేక యాప్

అచ్చంపేట, : ఉమ్మడి పాలమూరు జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికల సమరం ముగిసింది. కొత్తగా ఎన్నికైన పాలకవర్గాలు ఈ నెల 22న కొలువు దీరనున్నాయి. ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, వార్డు సభ్యులు పాలనా పగ్గాలు చేపట్టనున్నారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల అమలుకు నిధులు మంజూరు చేస్తుంటాయి. పంచాయతీలకు మంజూరయ్యే నిధులతో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్న విషయంలో పాలకవర్గ సమావేశాల్లో తీర్మానించి అమలు చేయాల్సి ఉంటుంది. నిధుల వ్యయం విషయంలో చాలా మంది అక్రమాలకు పాల్పడటంతో గతంలో చెక్ పవర్ రద్దుతో పాటు పదవులను కూడా కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి.

## అక్కినపల్లిలో నూతన సర్పంచ్, ఉపసర్పంచ్ ప్రమాణస్వీకారం

నకిరేకల్, : నార్కట్పల్లి మండలం అక్కినపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణస్వీకారం ఈరోజు ఘనంగా జరిగింది. స్పెషల్ ఆఫీసర్ సార్ ఆంజనేయులు గారు నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మొదట సర్పంచ్ సిరబోయిన నవ్య యాదవ్, ఆ తర్వాత ఉపసర్పంచ్ మిడిదొడ్డి లక్ష్మమ్మ సైదుల్, అనంతరం వార్డ్ సభ్యులు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జానకమ్మ, కారోబార్ శివ శంకర్, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అమెరికాలో నల్గొండ యువకుడి మృతి

నల్లగొండ, : నల్గొండ మండలం మేళ్ల దుప్పలపల్లికి చెందిన పవన్ రెడ్డి అనే యువకుడు శనివారం తెల్లవారుజామున అమెరికాలో అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు. బీటెక్ పూర్తి చేసి, ఎంఎస్ చదివేందుకు రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లిన పవన్, మిత్రులతో కలిసి పార్టీలో పాల్గొన్న తర్వాత అకస్మాత్తుగా మరణించాడు. పోస్టుమార్టం నివేదిక తర్వాత మృతికి గల కారణాలు మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఉద్యోగానికి ఎంపికయ్యాడని సంతోషిస్తున్న తరుణంలోనే ఈ విషాదం చోటు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు.

## యాదగిరి క్షేత్రంలో మార్గళి వేడుక

మిర్యాలగూడ, : ప్రముఖ వైష్ణవ క్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ సమేత పంచ నారసింహుడి దివ్యాలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం గోదాదేవి తన మనోనాథుడిని ఆరాధిస్తూ, పూజించిన వైనాన్ని ఆలయ ప్రధాన పూజారి కాండూరి వెంకటాచార్య ప్రవచనం ద్వారా వివరించారు. వేకువజామున కొనసాగిన ఈ ఆధ్యాత్మిక క్రతువులో మహిళా భక్తులు పాల్గొని పూజలు చేశారు.

## గెలిచిన సర్పంచ్ ఇంటిపై అర్ధరాత్రి దాడి

మునుగోడు, : కొండమల్లేపల్లి మండలం గన్యా నాయక్ తండాలో అర్ధరాత్రి తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మూడో విడతలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన రామావత్ గోజి విజయం సాధించారు. దీంతో ఓడిపోయిన అభ్యర్థికి సంబంధించిన సుమారు 30 మంది వ్యక్తులు అర్ధరాత్రి రాళ్లతో, కర్రలతో గోజి ఇంటిపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి నుంచి గుంపులను చెదరగొట్టి పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

# గెలిచినోళ్ళు పేల్చిన పటాకులు

# ఒడినోళ్ళ ఇంట్ల పత్తిల పడ్డ నిప్పు రవ్వలు





ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) రాచర్ల గొల్లపల్లి గ్రామంలో సర్పంచ్ ప్రమాణ స్వీకారోత్సవ ర్యాలీలో పటాకులు కాలుస్తుండగా దాసరి నాగరాణి సత్తయ్య ఇంట్లో ఎగిరిపడ్డ నిప్పురవ్వ రంజుకుని నిల్వచేసిన పత్తికి అంటుకున్న నిప్పు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు నీళ్లు చల్లి మంటలను ఆర్పడంతో తప్పిన ప్రమాదం. ఈ సందర్భంగా దాసరి నాగరాణి మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పత్తి మంటలు కాలిపోయి తీవ్ర నష్టం జరిగిందని, అనవసరంగా మా ఇంటి దగ్గర పటాకులు పేల్చడంతో పత్తికి మంటలు అంటుకున్నాయని ఆరోపించారు. తీవ్ర నష్టం జరగడంతో కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థుల ఇంటి ముందు డప్పు చప్పులతో పటాకులు పేల్చి సంబరాలు చేసుకోవడం ఏంటని, ఎన్నికల నియమ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఎదుటివారి మనోభావాలను కించపరచడమే కాకుండా కాల్చి ఆర్థికంగా నిలదొక్కుకోకుండా చేస్తున్నారని దాసరి పూర్ణిమ గణేష్ ఆరోపించారు.

గెలుపు, ఓటములు సహజం గ్రామాన్ని అభివఅద్ధిలో ముందుకు తీసుకువెళ్లాలని రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన చేయాలని కోరుకుంటున్నామని అన్నారు.

# యూనియన్‌ల నాయకులను అక్రిడేషన్ కమిటీలో సభ్యులుగా చేర్చకండి

- అక్రిడేషన్ జారీలో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి: తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం
- అక్రిడేషన్ జీవో ప్రకటించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు - తొలిసారి డిజిటల్ మీడియాకు అవకాశం ఇవ్వడం మంచి సూచకం
- విద్యార్హతను ప్రకటించినందుకు ధన్యవాదాలు - జర్నలిస్టులకు కుటుంబాలకు వైద్యం వారి పిల్లలకు విద్య ఉచితంగా ఇవ్వాలి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)

బీఆర్ఎస్ ప్రభుత్వం లో జారీ చేసిన అక్రిడేషన్ కార్డులను ప్రతి మూడు నెలలకు ఒకసారి స్టాంపులు అతికించి తేదీలను పొడిగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు అక్రిడేషన్ జీవోను రిలీజ్ చేసింది, అక్రిడేషన్ కమిటీలో యూనియన్ సభ్యులకు స్థానం కల్పిస్తాం అనడం శోచనీయమని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం తీవ్రంగా ఖండిస్తుంది. అక్రిడేషన్ కమిటీలో యూనియన్ సభ్యులకు ఎట్టి పరిస్థితులలో స్థానం కల్పించొద్దని అలా కల్పించినచో ఆ యూనియన్ సభ్యులకె అక్రిడేషన్ కార్డులు జారీ చేసుకుంటున్నారని వేరే యూనియన్ లలో ఉన్న జర్నలిస్టులకు అక్రిడేషన్లను అసలు ఇవ్వారని ఇలా పక్షపాత వైఖరి వహించి గతంలో ఎంతోమంది నిజమైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు రాకుండా అడ్డుకున్నారని తెలిపారు. ఇతర యూనియన్లలో ఉన్న రిపోర్టర్లకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వడంలో అనేక వంకలు పెడుతున్నారని, దానికి డిపిఆర్వోలు సహకరించడం జరిగిందని ఇందుకు నిజాంబాద్ జిల్లా నే సాక్ష్యమని తెలిపారు. అక్రిడేషన్ కమిటీలలో యూనియన్ల నాయకులకు అవకాశం అస్సలు ఇవ్వొద్దు గతంలో ఇయ్యడం వల్ల అక్రిడేషన్ కార్డుల జారీలో యూనియన్ నాయకులు భారీగా అవకతవకలకు పాల్పడడంతో పాటు వాళ్ళ యూనియన్ లో ఉన్న రిపోర్టర్లకే అక్రిడేషన్ కార్డులు జారీ చేయించుకున్నారు. నిజమైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అడ్డుకొని దుర్మార్గానికి పాల్పడ్డారు. మళ్లీ యూనియన్ నాయకులకు ఈ అవకాశమిస్తే నిజమైన రిపోర్టర్లకు అక్కడేషన్ కార్డులు అసలు రావు కేవలం పాలు, పూలు, పండ్లు, పేపర్ వేసే వాళ్లకు, సైకిల్ రిపేర్ చేసే వాళ్లకు, కమిటీ లో ఉన్న వాళ్ల బంధువులకు, సర్పంచులకు ఇచ్చుకుంటున్నారు. అందుకోసమే సమాచార శాఖ మంత్రి స్పందించి అక్రిడేషన్ కమిటీలలో యూనియన్ నాయకుల ప్రమేయం లేకుండా భేషరతుగా తొలగించాలని తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం డిమాండ్ చేస్తుంది.

### జర్నలిస్టు కుటుంబాలకు విద్య వైద్యం అందించాలి..

జర్నలిస్టులకు వారి పిల్లలకు విద్యా, వైద్యం ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందించాలని అక్రిడేషన్ కార్డ్ ఉన్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఆక్సిడెంట్ పాలసీని ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వం రైల్వే ప్రయాణం చేసే జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా ప్రయాణం అందించాలని, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని అలాంటి జర్నలిస్టులను ప్రభుత్వం చులకనగా చూడకుండా వారికి అన్ని విధాలుగా అండగా ఉండాలని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం కోరుతుంది.

## ఆరోగ్య కూడిక.. అనర్ధాల తీసివేత

దేవరకొండ, : కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు.. ఇవి మనం చిన్నప్పటి నుంచి గణితంలో చూస్తున్న పదాలు. ఎక్కడ ఉన్నా.. ఏ పని చేస్తున్నా.. గణితం అనేది మన జీవితంలో భాగంగానే ఉంటుంది. బిడ్డ పుట్టుకే లెక్కలతో ప్రారంభం అవుతుంది. పుట్టగానే ఎన్ని శిశువు ఎన్ని కిలోల బరువు ఉందో లెక్కిస్తారు. అప్పటి నుంచి మరణ తర్వాత కూడా.. దశ దిన కర్మ, నెల మాసికం, ఏడాది మాసికం వంటి ఎన్నో కార్యక్రమాలు చేయడంలో సైతం లెక్కలు మిళితమై ఉంటాయి.

## వరుస చోరీలు... తాళం వేసిన ఇళ్ళే టార్గెట్

నిజామాబాద్ అర్బన్, : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక నగర్లో దుండగులు మూడు ఇళ్లకు తాళాలు పగలగొట్టి భారీ చోరీకి పాల్పడ్డారు. తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనల్లో 9.5 తులాల బంగారు నగలు, అరకిలో వెండి, రూ. 78 వేల నగదును దోచుకెళ్లారు. ఒక టైలర్ ఇంట్లో బీరువా పగలగొట్టి 8.5 తులాల బంగారం, అరకిలో వెండి, రూ. 40 వేలు, పూజారి ఇంట్లో ఒక తులం బంగారం, రూ. 8 వేలు, ఒంటరి మహిళ ఇంట్లో రూ. 30 వేల నగదును దొంగలు అపహరించుకెళ్లారు.

## వేల్పూర్ వద్ద రోడ్డు ప్రమాదం

బాల్కొండ, : నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం అమీనాపూర్ ఎక్స్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్కోరా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. తన టీవీఎస్ ఎక్స్ ఎల్ పై వేల్పూర్ వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టిందని ఎస్ఐ సంజీవ్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ప్రమాదానికి గల కారణాలు, మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## సర్పంచుల ప్రమాణ స్వీకారం

బోధన్, : వేల్పూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచి మొండి అశోక్, ఆయన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఎంపీడీవో బాలకిషన్, సెక్రెటరీ వినోద్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## కాంగ్రెస్ ప్రజాపాలనకు పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం

ఆర్మూర్, : పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారని నిజామాబాద్ గ్రామీణ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి మండలం ధర్మారం (బి) గ్రామపంచాయతీ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఆయన పాల్గొన్నారు. నూతన సర్పంచ్ పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో సర్పంచులు ముందుండాలని సూచించారు.

## సుల్తాన్ పల్లి నూతన సర్పంచ్, ఉప సర్పంచ్ ప్రమాణ స్వీకారం

రాజేంద్రనగర్, : శంషాబాద్ మండలం సుల్తాన్ పల్లి గ్రామంలో నూతన సర్పంచ్ గా ఎల్గాని ప్రభాకర్ గౌడ్, ఉప సర్పంచ్ గా దండు శివకుమార్, మిగిలిన వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. రాజేంద్ర నగర్ లో జరిగిన ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు తమ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు నూతన నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

## హైదరాబాద్ పోలీసులు అప్రమత్తం

చార్మినార్, : న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. అర్ధరాత్రి పూట రాచకొండ కమిషనరేట్ పోలీసులు స్పెషల్ ఆపరేషన్ నిర్వహించి, బాలాపూర్ హోటల్స్, క్రికెట్ గ్రౌండ్స్లో తనిఖీలు చేపట్టారు. రాత్రిపూట గేమ్స్, అనుమతి లేకుండా వేడుకలు నిర్వహించకూడదని నిర్వాహకులకు, హోటల్ యజమానులకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## మరకత శివాలయాన్ని దర్శించుకున్న దర్శకుడు బోయపాటి

వికారాబాద్, : శంకర్పల్లి: ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను రంగారెడ్డి జిల్లా శంకర్పల్లి మండలం చెందిప్పలోని మరకత శివలింగ దేవాలయాన్ని సోమవారం దర్శించుకున్నారు ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అధికారులు ఆయనను శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

## వేములవాడలో పంచాయతీ రాజ్ రాష్ట్ర డైరెక్టర్ గుమ్మడి సమ్మయ్యకు ఘన సత్కారం



వేములవాడ (ప్రశ్న న్యూస్)తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం వేములవాడలో తెలంగాణ పంచాయతీ రాజ్ రాష్ట్ర డైరెక్టర్ గుమ్మడి సమ్మయ్య ను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా బత్తుల మహేందర్ యాదవ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల బలోపేతం, బీసీ వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

గ్రామ స్థాయి పాలన మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువగా ఉండేలా పంచాయతీ రాజ్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వాసం మల్లేశం యాదవ్, నక్క కొమురయ్య, ఊరడి లింగయ్య, గడ్డి మల్లేశంతో పాటు పలువురు బీసీ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రత్నంపేట నూతన సర్పంచ్ వెంకటేష్‌కు సిపిఎం వినతి పత్రం - సానుకూల స్పందన



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, రత్నంపేట గ్రామ నూతన సర్పంచ్‌గా వార్డు సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ కౌడగాని వెంకటేష్‌కు సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గురిజాల శ్రీధర్ నేతృత్వంలో వినతి పత్రాన్ని సర్పంచ్‌కు అందజేశారు. తాగునీటి కొరత, అంతర్గత రహదారుల దుస్థితి, పారిశుధ్య సమస్యలు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి అంశాలను వినతి పత్రంలో ప్రస్తావించారు.వినతి పత్రాన్ని స్వీకరించిన నూతన సర్పంచ్ డాక్టర్ కౌడగాని వెంకటేష్ సానుకూలంగా స్పందిస్తూ, గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పాలకవర్గంతో కలిసి సమన్వయంగా పని చేసి, సూచించిన సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## శాభాష్‌పల్లి ప్రథమ పౌరుడిగా ఏ.టి.యాదవ్ బాధ్యతలు స్వీకరణ - ఘన సన్మానం, శుభాకాంక్షలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ అర్బన్ మండలంలోని శాభాష్‌పల్లి గ్రామ ప్రథమ పౌరుడిగా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన ఏ.టి. యాదవ్ సోమవారం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేసి, అనంతరం గ్రామ తొలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి ప్రజల సహకారంతో పారదర్శకంగా పాలన సాగిస్తానని ఆయన పేర్కొన్నారు.ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన తరువాత సర్పంచ్ ఏ.టి.యాదవ్‌ను ఆయన సన్నిహితులు, మిత్రులు, గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు గజమాలతో ఘనంగా సన్మానించారు. మరోసారి గ్రామ ప్రథమ పౌరుడిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామ అభివృద్ధి దిశగా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, యాదవ సంఘ నాయకులు, అభిమానులు పాల్గొని సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

## విలాసాగర్ గ్రామంలో వినూత్న పాలనకు శ్రీకారం


- సర్పంచ్ కనుకయ్య తొలి అడుగు
- రూపాయికే 20 లీటర్ల శుద్ధి తాగునీరు
- ఆడబిడ్డ పుడితే రూ.5 వేల ఆర్థిక సాయం!



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, విలాసాగర్ గ్రామ నూతన సర్పంచ్ ఏనుగుల కనకయ్య పంచాయతీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బాధ్యతలు చేపట్టిన తొలిరోజే అమలు చేసి ప్రత్యేకతను చాటుకున్నారు .సోమవారం సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టిన ఆయన, ముందుగా ఆడపిల్ల పుట్టిన కుటుంబానికి రూ.5,000 చెక్కును అందజేశారు. ఆడబిడ్డల పట్ల గౌరవం, ప్రోత్సాహం కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.అదేవిధంగా గ్రామ ప్రజలకు కేవలం ఒక్క రూపాయికే 20 లీటర్ల శుద్ధి చేసిన తాగునీటిని అందించే పథకాన్ని కూడా ప్రారంభించారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించి ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన నీరు అందించడమే తన ప్రథమ కర్తవ్యమని సర్పంచ్ కనకయ్య పేర్కొన్నారు.ఎన్నికల హామీలను మాటలకే పరిమితం చేయకుండా కార్యరూపంలో చూపించిన సర్పంచ్ చర్యలపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# రైతుల విజేత చౌదరి చరణ్ సింగ్

### యూపీకీ రెండు సార్లు ముఖ్యమంత్రి  భారత దేశానికి ఐదవ ప్రధాని



రైతుల శ్రేయస్సు కోసం తన జీవితాన్నే ధారపోసిన మహనీయుడు. భూస్వాములకు వ్యతిరేకంగాపోరాడిన యోధుడు. విప్లవాత్మక భూసంస్కరణలకు అద్యుడు చరణ్ సింగ్. యూపీకీ రెండు సార్లు ముఖ్యమంత్రిగా. భారత దేశానికి ఐదవ ప్రధానిగా తన సేవలు అందించారు. ఏ స్తాయిలో ఉన్నా.. సంక్షమాన్ని మరిచిపోలేదు. రైతుల అభ్యుదయం కోసం నిరంతరం కృషి చేశారు. అందుకే ఆయన జయంతిని జాతీయ రైతు దినోత్సవంగా ప్రతి సంవత్సరం మనం జరుపుకొంటున్నాం. భారతదేశానికి 5వ ప్రధానమంత్రిగా 1979 జూల్కై 28 నుండి 1980 జనవరి 14 వరకు తన సేవలనందించాడు. చరిత్రకారులు, ప్రజలు తరచూ అతనిని 'భారతదేశపు రైతుల విజేత' గా గుర్తించారు. ప్రధానమంత్రి కంటే ముందు ఈయన ఉప ప్రధానమంత్రిగా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి గా కూడా పనిచేశాడు. మరి అలాంటి మహానాయకుని గురించి తెలుసుకుందామా..

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్ జిల్లాలోని ఒక సాధారణ రైతు కుటుంబంలో 1902 డిసెంబర్ 23న జన్మించారు చరణ్‌సింగ్. మహాత్మా గాంధీ అద్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో చేరాడు. గజియాబాద్ జిల్లాలోని ఆర్యసమాజ్, అదే విధంగా విరీరట్ జిల్లాలోని భారత జాతీయ కాంగ్రెస్ లలో 1931 నుంచి క్రియాశీలకంగా ఉన్నాడు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో రెండు సార్లు జ్కెలు పాలయ్యాడు. భారత స్వాతంత్ర్యానికి ముందు అతను 1937 లో యున్కెటెడ్ ప్రొవిన్సెస్ శాసనసభలో సభ్యునిగా ఉన్నాడు. అతను గ్రావిరీణ ఆర్థిక వ్యవస్థకు హాని కలిగించే చట్టాలపై ఎక్కువ ఆసక్తిని కనబర్చేవాడు. భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా తన సైద్ధాంతిక, ఆచరణాత్మక విధానాన్ని నిర్మించాడు.1962 %-% 1967 మధ్య కాలంలో అతను "రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలలోని ముగ్గురు ప్రధాన నాయకుల"లో ఒకనిగా ఉన్నాడు. 1950లలో ఉత్తరప్రదేశ్ లోని అప్పటి ముఖ్యమంత్రి పండిట్ గోవింద్ వల్లబ్ పంత్ పర్యవేక్షణలో భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగని అత్యంత విప్లవాత్మక భూ సంస్కరణల చట్టాలను రూపొందించడంలోను, వాటిని ఆమోదించడంలోనూ చరణ్ సింగ్ మంచి గుర్తింపు పొందాడు. మొదట పార్లమెంటరీ సెక్రటరీ గాను, తరువాత భూసంస్కరణలకు బాధ్యత వహించే రెవెన్యూ మంత్రిగాను అతను ఈ కార్యాలను సాధించాడు. 1959లో భారతదేశంలో తిరుగులేని నాయకుడు, భారత ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ సామ్యవాద, సముదాయవాద భూ విధానాలను నాగపూర్లో జరిగిన కాంగ్రెస్ సెషన్లో బహిరంగంగా వ్యతిరేకించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించాడు.వర్గాలుగా విడిపోయి ఉన్న ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ లో తన స్పష్టమైన విధానాలు, విలువలను స్పష్టం చేయగల సామర్థ్యాల కారణంగా అతను ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఈ కాలం తరువాత, చరణ్ సింగ్ 1967 ఏప్రిల్ 1 న కాంగ్రెస్ నుండి వైదొలగి, ప్రతిపక్ష పార్టీలోనికి చేరాడు. అపుడు ఉత్తర ప్రదేశ్ లో మొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రి అయ్యాడు. 1967%-%1971 మధ్యకాలంలో భారతదేశంలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు బలమైన శక్తిగా ఉండే కాలం.జనతా కూటమిలో ప్రధాన భాగమైన భారతీయ లోక్‌దళ్ పార్టీ నాయకునిగా, అతను 1977 లో జయప్రకాష్ నారాయణ్ ప్రధానమంత్రిగా మొరార్జీ దేశాయ్ను ఎంపిక చేసాడు. ప్రధానమంత్రి పదవి తన కోసం కాదనీ, గ్రావిరీణ ఆర్థిక వ్యవస్థ ఆసక్తితో తన విప్లవాత్మక ఆర్థిక కార్యక్రమాలను అమలు చేయటానికి వీలు కల్పించటానికి ఉపయోగపడుతుందనీ ఆశించి ప్రధాని రేసులో నిలబడ్డాడు. కానీ తన ఆశయం నెరవేరనందున నిరాశ చెందాడు.1977 లోక్‌సభ ఎన్నికల్లో, జనతా పార్టీతో కలసి ఎన్నికలలో పాల్గొనడానికి కొద్ది నెలల ముందు వరకు, అతను 1974 నుండి ఒంటరిగానే పోరాడుతూ ఉన్నాడు. రాజ్ నారాయణ చేసిన కృషి కారణంగా ఆయన 1979 లో ప్రధాని అయ్యాడు. రాజ్ నారాయణ్ జనతా పార్టీ (సెక్యులర్) ఛైర్మన్‌గా, చరణ్ సింగ్ ను ప్రధానమంత్రిగా నియమించాడు. ఉత్తరప్రదేశ్ లో 1967 లో ఆయన ముఖ్యమంత్రిగా ఉండడానికి కూడా అతను సహాయం చేసాడు. అయితే, "ఇందిరా గాంధీ కాంగ్రెస్ పార్టీ" ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్నప్పుడు కేవలం 24 వారాల తరువాత ఆయన పదవికి రాజీనామా చేశాడు. ఆయన ప్రధానిగా ఉన్న కాలములో లోక్‌సభ ఎన్నడూ సమావేశం కాలేదు. లోక్ సభ సమావేశం ప్రారంభమవుతుందనగా ముందు రోజు ఈయన ప్రభుత్వానికి మద్దతునిచ్చిన కాంగ్రెసు పార్టీ మద్దతు ఉపసంహరించుకోవడంతో భారతీయ లోక్‌దళ్ ప్రభుత్వం కూలిపోయింది. చరణ్ సింగ్ పదవికి రాజీనామా చేశాడు. 6 నెలల అనంతరం లోక్‌సభకు మళ్ళీ ఎన్నికలు జరిగాయి. చరణ్ సింగ్ 1987 లో తన మరణం వరకు లోక్‌దళ్ పార్టీకి నాయకత్వం వహిస్తూ ప్రతిపక్షంలో ఉన్నాడు. చరణ్ సింగ్ 1985 నవంబరు 29 న గుండెపోటుకు గురయ్యాడు. అతనికి యు.ఎస్. లోని ఆసుపత్రిలో వైద్యం చేయించినప్పటికీ నయం కాలేదు. 1987 మే 28న వైద్యులు అతనికి శ్వాస ఆడటం లేదని న్యూఢిల్లీ లోని అతని నివాసానికి కబురు అందించారు. తరువాత రోజు ఉదయం 2.35 కు అతను మరణించినట్లు ప్రకటించారు.రైతు బంధుగా పేరుతెచ్చుకున్న చరణ్ సింగ్ సమాధిని కిసాన్ ఘాట్ అని పిలుస్తారు. అతని జన్మదినం డిసెంబరు 23 న కిసాన్ దివస్ (జాతీయ రైతు దినోత్సవం) గా భారతదేశంలో జరుపుతారు. అతని మూడవ వర్ధంతి (1990, మే 29) సందర్భంగా భారత ప్రభుత్వం అతని చిత్రంతో తపాలా బిళ్లను విడుదలచేసింది.



**అమీనా కలందర్**

## బూరుగుపల్లి ప్రథమ పౌరురాలు పెంచాల సౌమ్యకు శుభాకాంక్షలు - ఘన సన్మానం

**- శ్రీ ఆంజనేయ స్వామి కలర్ గ్రానైట్స్ అధినేత, విశ్వబ్రాహ్మణ - విశ్వకర్మ ఐక్య సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు : పాములపర్తి వేణుగోపాల చారి**





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామ సర్పంచిగా గెలుపొందిన పెంచాల సౌమ్య- మహేష్ దంపతులకు, ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్యతో పాటు వార్డు సభ్యులకు సోమవారం ప్రమాణ స్వీకారం, తొలి సమావేశం అనంతరం ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ ఆంజనేయ స్వామి కలర్ గ్రానైట్స్ అధినేత, విశ్వబ్రాహ్మణ - విశ్వకర్మ ఐక్య సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పాములపర్తి వేణుగోపాల చారి శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వేణుగోపాల చారి మాట్లాడుతూ, "బూరుగుపల్లి గ్రామ అభివృద్ధికి నూతన పాలకవర్గం సమన్వయంతో, పారదర్శకంగా పనిచేయాలి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి. సర్పంచ్ పెంచాల సౌమ్య నాయకత్వంలో గ్రామం అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను. విశ్వకర్మ వర్గాల సమస్యల పరిష్కారానికి కూడా నా వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొని నూతన పాలకవర్గానికి అభినందనలు తెలియజేశారు.

## నాగారం పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానించిన మహ్మద్ అఫ్జల్ ఖాన్






మహేశ్వరం (ప్రశ్న న్యూస్) ప్రజాధరణ పొందేలా ప్రజా ప్రతినిధులు వ్యవహరించాలని అఫ్జల్ అన్నారు. మహేశ్వరం మండలం నాగారం గ్రామ పంచాయతీ పాలక వర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్న మహ్మద్ అఫ్జల్ ఖాన్ మాట్లాడుతూ రాజకీయాలలో ప్రజా ప్రతినిధులుగా గెలుపొందిన వారు ప్రజలకు సేవలు అందించే విధంగా వ్యవహరించాలని కోరారు. ప్రజాధరణ పొందిన వ్యక్తులు రాజకీయాలలో రాణిస్తారని అన్నారు. రాజకీయాలలో గెలుపోటములు సహజమని, ప్రజల మధ్య ఉంటే ఎప్పుడూ ఆదరణ ఉంటుందని అన్నారు. ఐదు సంవత్సరాలు నాగారం గ్రామ ప్రజలు అందించిన తీర్పు చారిత్రాత్మకమని ఐదు సంవత్సరాలు గ్రామాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం సర్పంచ్ బండారి లింగం ముదిరాజ్, ఉప సర్పంచ్ మంచి చంద్రకళ, తో పాటు 1వార్డు మెంబెర్ మల్లెల శ్యామలమ్మ, 2వార్డు కుండే హరీష్, 3వార్డు మహమ్మద్ నయీమ్ ఖాన్, 5వార్డు మహమ్మద్ షాబుద్దీన్ ఖాన్, 6 వార్డు ఘనపురం మహేందర్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## 30వ సారి రక్తదానం - మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం మహేష్




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, బూరుగుపల్లి గ్రామానికి పెరుక మహేష్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన తాళ్ళపల్లి లత అనే పేషెంట్‌కు చికిత్స నిమిత్తం అత్యవసరంగా రక్తం అవసరమైంది. ఈ విషయం తెలుసుకున్న వెంటనే మహేష్ స్వచ్ఛంద రక్తదాత సకాలంలో స్పందించి తన 30వ రక్తదానాన్ని నిర్వహించి లతకు ప్రాణాధారంగా నిలిచారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా వెనుకాడకుండా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా, “రక్తం ఇవ్వడం అంటే జీవితం ఇవ్వడమే” అన్న సందేశాన్ని మరోసారి చాటారు. ఈ గొప్ప సేవకు వైద్యులు, పేషెంట్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఇలాంటి మానవతా చర్యలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని స్థానికులు ప్రశంసలు కురిపించారు.

# అవినీతి నిర్మూలనే మా కర్తవ్యం

### - ధర్పల్లి సర్పంచ్ చెలిమేళ శ్రీనివాస్

ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం కేంద్రంలో గల దర్పల్లి గ్రామ పంచాయతీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఏర్పాటు చేయడం జరిగింది.ముందుగా శాల్వా పూలమాలతో సన్మానించి వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.ముందుగా సర్పంచ్ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ నేను మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చాను అన్ని బాధలు ఎలా సాల్వ్ చేయాలో తెలిసిన వ్యక్తిని కాబట్టి ఏ సమస్యలున్న సరాసరి గ్రామపంచాయతీ వచ్చి ఫిర్యాదు చేయండి నేను వాటిని పరిష్కరిస్తాను కానీ సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే సమస్యలు పరిష్కారం కావాలి కాబట్టి మీ కొరకు ఎప్పుడు మన గ్రామపంచాయతీ తలుపులు తెరిచి ఉంటాయని తెలియజే



స్తున్నామన్నారు.ఈ కార్యక్రమం ధర్పల్లిలో పండుగ వాతావరణం తలపించింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజు చెలిమెల నరసయ్య, పుప్పాల సుభాష్,



సొసైటీ మాజీ చైర్మన్ చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వరుస హత్యల కేసులో నిందితుడికి జీవిత ఖైదు

### జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్) శంకరంపేట్ – ఆర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస హత్యలతో సంచలనం సృష్టించిన నిందితుడికి న్యాయస్థానం జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.60,000 జరిమానా విధించిందని జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే, 2024 అక్టోబర్ నెలలో ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో మల్లేష్ అనే వ్యక్తి నవీన్‌ను బండరాయితో మోదీ హత్య చేసి, మృతదేహంపై చెత్త కాగితాలు వేసి నిప్పంటించిన ఘటన జరిగింది. అనంతరం అదే ఏడాది నవంబర్ నెలలో నిజామాబాద్‌కు చెందిన స్వామి అనే వ్యక్తితో పరిచయం పెంచుకున్న మల్లేష్, అతడితో కలిసి రైల్లో మీర్జాపల్లికి వెళ్లి అక్కడ మద్యం సేవించిన అనంతరం నిద్రించారు. రాత్రి సుమారు 12.30 గంటల సమయంలో మల్లేష్ స్వామిని బండరాయితో మోదీ హత్య చేసి, మృతదేహంపై సంచి వేసి నిప్పంటించాడు.ఈ ఘటనలపై ఎస్ఐ నారాయణ గౌడ్ కేసు నమోదు చేయగా, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ వెంకట రాజా గౌడ్ సమగ్ర దర్యాప్తు నిర్వహించి కీలక సాక్ష్యాలను సేకరించారు. రెండు హత్య లలో సాక్ష్యాధారాలను పరిశీలించిన జిల్లా జడ్జి శ్రీమతి నీలిమ నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.60,000 జరిమానా విధించారాని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కేసు విచారణలో పబ్లిక్ ప్రాస్యూటర్ వెంకటేష్ , లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ విట్టల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ అశోక్ కేసులో సహకరించారు.ఈ కేసులో నిందితుడికి కఠిన శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## కొల్చారం మండల వ్యాప్తంగా నూతన సర్పంచుల

# ప్రమాణ స్వీకారం మహోత్సవం

### సందడిగా మారిన గ్రామపంచాయతీ కార్యాలయాలు







మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు కిష్టాపురం గ్రామ సర్పంచిగా సాదుల స్వప్న ఊశయ్య, రాంపూర్ సర్పంచ్ గా నెల్లి రాజు, అప్పాజీపల్లి సర్పంచ్ గా గజిని వెంకట్ గౌడ్, పోతంశెట్టిపల్లి గ్రామ సర్పంచిగా పాతూరి దయాకర్ గౌడ్, వెంకటాపూర్ గ్రామ సర్పంచ్ గా కన్నబోయిన సుజాత, వస్త్రం తండా సర్పంచిగా వినోద్ నాయక్, పోతిరెడ్డిపల్లి సర్పంచ్ గా చంద్రశేఖర్ రెడ్డి, అంసన్పల్లి గ్రామ సర్పంచ్ గా గీత రమేష్, జలాల్పూర్ గ్రామ సర్పంచిగా దేవి సింగ్, కొంగోడు గ్రామ సర్పంచ్ గా దుబ్బ గళ్ళ స్వామి, కొల్చారం సర్పంచ్ గా దేవన్న గారి శేఖర్, వరిగుంతం సర్పంచిగా పుట్ల గళ్ళ మోహన్ సీతారాం తాండ సర్పంచిగా కమ్లి మోహన్ సింగ్, చిన్న ఘనపూర్ సర్పంచ్ గా చందాపురం మధుసూదన్ రెడ్డి, సంగాయపేట గ్రామ సర్పంచ్ గా కర్రే కాంతమ్మ ప్రభాకర్, రంగంపేట గ్రామ సర్పంచ్ గా అరిగే స్వర్ణలత తుక్కాపూర్ గ్రామ సర్పంచిగా దొడ్ల ఆంజనేయులు, పైతర గ్రామ సర్పంచ్ గా యాబన్నగారి రవితేజ, కోనాపూర్ గ్రామ సర్పంచ్ గా నిర్మల మల్లేశం, ఎనగండ్ల గ్రామ సర్పంచిగా కోరబోయిన లక్ష్మి, మందాపూర్ గ్రామ సర్పంచ్ గా విమలమ్మ, ను నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులను స్పెషల్ ఆఫీసర్లు పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్ మరియు ఉపసర్పంచ్ మరియు వార్డు మెంబర్లను ప్రమాణ స్వీకారం చేయించారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర చాలా కీలకమైనద ఇలాంటి పదవిని మాపై నమ్మకం ఉండి గ్రామ ప్రజలు గెలిపించినందుకు వారికి ఎల్లవేళలా తోడు ఉండి ఇటు అభివృద్ధిలో గాని మరియు సంక్షేమ ఫలాలను ప్రజలకు చేరే విధంగా మా బాధ్యతను స్వీకరిస్తామని తెలిపారు గ్రామంలో ఏ సమస్య ఉన్న గాని మా దృష్టికి వచ్చిన వెంటనే ఆ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు మరియు గ్రామాలలో తాగునీటి సమస్యను మరియు డ్రైనేజీ సమస్యలను వీధిలైట్లు సమస్యలను సిసి రోడ్డు పనులను వంటి ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి కొల్చారం మండలం గ్రామాలన్నీ ససశ్యామలంగా మారుస్తామని నూతనంగా ఎన్నికైన సర్పంచులు తెలిపారు ఈ సర్పంచుల ప్రమాణ స్వీకార మహోత్సవానికి కొల్చారం మండల వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొని నూతనంగా ఎన్నికైన సర్పంచులను ఉపసర్పంచ్ లను వాడు సభ్యులను శాలువాతో పూలమాలతో ఘనంగా సత్కరించి స్వీట్ తినిపించి వారికి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బూరుగుపల్లి ప్రథమ పౌరురాలిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్ పెంచాల సౌమ్య - పాలకవర్గం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పెంచాల సౌమ్య సోమవారం అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, పాలకవర్గ సభ్యులు, అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ పెంచాల సౌమ్య మాట్లాడుతూ “గ్రామ ప్రజలు నాపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు. బూరుగుపల్లి గ్రామ అభివృద్ధే నా లక్ష్యం. తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు వంటి మౌళిక వసతుల మెరుగుదలకు తొలి ప్రాధాన్యం ఇస్తానని, ప్రతి వర్గాన్ని కలుపుకొని పారదర్శక పాలన అందిస్తూ, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం అంతా కలిసికట్టుగా పని చేస్తాం” అని తెలిపారు. అనంతరం గ్రామాభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని పేర్కొంటూ, సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ముగిసింది.

## గుడి తండా గ్రామంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రమాణ స్వీకారం




ధర్పల్లి (ప్రశ్న న్యూస్) ధర్పల్లి మండల్ గుడి తండా గ్రామంలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్పెషలాఫీసర్ చేతుల మీదుగా జరిగింది.ముందుగా సర్పంచ్ మాలావత్ సరస్వతి రమేష్, ఉపసర్పంచ్ సభావాత్ మోహన్ నాయక్, మిగతా ఏడు వార్డ్ మెంబర్లు గా ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో మొదటగా నేను మాలావత్ సరస్వతి అంటూ మొదలుపెట్టి సభ్యులందరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికైన కార్యవర్గంకు మాజీ సర్పంచ్ లింబయ నాయక్ సన్మానం చేశారు. తండా పెద్దలు కారోబార్ అందరూ ఒకరికొకరు స్వీట్ తినిపించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ మేమందరం ఒకటిగా ఉండి వార్డ్ మెంబర్లతో సహా అందరిని యూనానిమస్ చేసుకోవడం జరిగింది. దీనికి నేను గుడి తండా వాసులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లిమ్యా నాయక్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## నీలోజిపల్లి గ్రామ ప్రథమ పౌరునిగా అనుముల భాస్కర్ ప్రమాణ స్వీకారం - తొలి గ్రామసభ నిర్వహణ





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామ ప్రథమ పౌరునిగా నూతనంగా ఎన్నికైన అనుముల భాస్కర్ సోమవారం గ్రామ వార్డు సభ్యులతో కలిసి అధికారికంగా ప్రమాణ స్వీకారం చేసి తన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో తొలి గ్రామసభను నిర్వహించారు.ప్రమాణ స్వీకార అనంతరం అనుముల భాస్కర్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనపై ఉంచిన విశ్వాసాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వృథా చేయనని, అందరి సహకారంతో నీలోజిపల్లి గ్రామాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామంలో కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని చట్టబద్ధంగా తిరిగి సాధించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు.అదేవిధంగా తాగునీటి సమస్యల పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ, అంతర్గత రహదారుల అభివృద్ధి, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. నీలోజిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో నిరంతరం కృషి చేస్తానని అనుముల భాస్కర్ పేర్కొన్నారు.

## సర్పంచ్ గా నల్ల మోహన్ బాధ్యతలు స్వీకరణ - వేణుగోపాల చారి సన్మానం - శుభాకాంక్షలు





బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి గ్రామ నూతన సర్పంచ్‌గా నల్ల మోహన్ సోమవారం గ్రామ పాలకవర్గ సభ్యులతో కలిసి అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వృథా చేయకుండా, అందరి సహకారంతో బోయినిపల్లిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. తాగునీరు, పారిశుధ్యం, అంతర్గత రహదారులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలిపారు.ప్రమాణ స్వీకారం అనంతరం శ్రీ ఆంజనేయస్వామి కలర్స్ గ్రానైట్ అధినేత, విశ్వ బ్రాహ్మణ – విశ్వకర్మ ఐక్య సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పాములపర్తి వేణు గోపాల చారి సర్పంచ్ నల్ల మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా వేణుగోపాల చారి పేర్కొన్నారు.

## డిగ్రీ కళాశాలలో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



ధర్పల్లి (ప్రశ్న న్యూస్ ) ధర్పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నాడు గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవాన్ని జరిపారు దీనిలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ జ్యోతి విద్యార్థులకు గణిత శాస్త్ర ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ జ్యోతి, డాక్టర్ జి శ్రీనివాస్ రెడ్డి, జి నిహారిక విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### జలమండలి ఔట్ సోర్సింగ్

# ఉద్యోగుల అందోళన

**హైదరాబాద్** అవుట్సోర్సింగ్ ఉద్యోగులను దినసరి కూలీలుగా మార్చే కుట్రలను తక్షణమే నిలిపివేయాలి డిమాండ్ చేస్తూ ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం ముందు కాంట్రాక్టు ఉద్యోగులు బైఠాయించారు. ప్లేకార్డులతో గేటు ముందు బైటాయించి ధర్నాకు దిగారు. భద్రత లేని టెండర్లను తక్షణమే రద్దు చేయాలని, శ్రమ దోపిడిని నిలిపివేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో 60 ని అమలు చేయాలని, తాత్కాలిక వ్యవస్థ వద్దు శాశ్వత పరిష్కారం కావాలని డిమాండ్ చేశారు. సుమారు 200 మంది ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయం వద్దకు చేరుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన నిపథ్యంలో స్థానిక ఖైరతాబాద్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. తమను ఔట్ సోర్సింగ్ నుంచి డైలీ వేజ్ లేబర్గా మార్చేందుకు కుట్ర జరుగుతోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవో నెంబర్ 60 ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏళ్లుగా పని చేస్తున్న తమను అన్యాయం చేయొద్దని డిమాండ్ చేస్తున్నారు. టెండర్ల పేరుతో ముఖ్యంగా మీటర్ రీడర్స్ ఉద్యోగులను మోసం చేయొద్దని స్పష్టం చేశారు. ఔట్ సోర్సింగ్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ నిరసనకు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు హాజరయ్యారు. సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.

# పతంగ్ అందరి హృదయాలను దోచుకుంటుంది



ప్రతిష్టాత్మక సంస్థ సురేష్ ప్రొడక్షన్స్ డి.సురేష్ బాబు సమర్పణలో రూపొందుతున్న చిత్రం 'పతంగ్'. పతంగుల పోటీతో రాబోతున్న ఈ యూత్‌ఫుల్ కామెడీ స్పోర్ట్స్ డ్రామాను సినిమాటిక్ ఎలిమెంట్స్ , రిషన్ సినిమాస్, మాన్‌సూన్ టేల్స్ సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా.. ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. ఇన్‌స్టాగ్రమ్ సెన్సేషన్ ప్రీతి పగడాల, జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్‌తో పాటు వంశీ పూజిత్ ముఖ్యతారలుగా నటిస్తున్నారు. పాపులర్ దర్శకుడు, నటుడు గౌతమ్ వాసుదేవ మీనన్, ప్రముఖ సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రల్లో కనిపించబోతున్నారు. డిసెంబరు 25న ప్రపంచవ్యాప్తంగా చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా మాట్లాడిన వంశీ పూజిత్.. 'ఈ చిత్రం ట్రైలర్ చూసిన వాళ్లందరూ మంచి రెస్పాన్స్ ఇచ్చారు. ట్రైలర్‌లో వున్న పాజిటివ్ వైబ్ సినిమాలో కూడా ఉంటుంది. పతంగ్ పోటీల సీజీ కూడా వరల్డ్‌క్లాస్ లెవల్‌లో ఉంటుంది. యూత్‌ఫుల్‌గా కలర్‌ఫుల్‌గా మా సినిమా అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది' అన్నారు. ప్రీతి పగడాల మాట్లాడుతూ.. 'పతంగ్‌లో నేను నటించడం ఎంతో ఆనందంగా ఉంది. ట్రైలర్ గురించి అందరూ మాట్లాడుకోవడం సంతోషంగా ఉంది. ట్రైలర్ మ్యాజిక్ చేసింది. ట్రైలర్ నచ్చిన అందరికి సినిమా కూడా నచ్చుతుంది' అన్నారు. ఇక ఈ సినిమా తనతో పాటు మా అందరికి చాలా టఫ్ అండ్ ఎమోషనల్ జర్నీ అని తెలిపిన ప్రణవ్ కౌశిక్.. విమర్శకుల ప్రశంసలు దక్కడంపై ఆనందం వ్యక్తం చేశాడు.

# ఒకడిని కష్టపెట్టి ఎదగాలి అనుకునే వారిని కర్మ వదిలిపెట్టదు



మంచు ఫ్యామిలీలో గత కొద్ది కాలంగా గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే. మంచు వారసులు విష్ణు, మనోజ్ ఆస్తుల కారణంగా ఒకరిపై ఒకరు దాడి కూడా చేసుకున్నారు. అంతేకాకుండా వీరిద్దరు కేసులంటూ పోలీస్ స్టేషన్లకు దాకా వెళ్లారు. ఈక్రమంలోనూ మంచు మనోజ్ ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. తన భార్య ఇద్దరు పిల్లలతో రోడ్డున పడ్డాడు. దీంతో ఆయన అభిమానులు సాయం చేయడంతో తన కుటుంబాన్ని జాగ్రత్తగా చూసుకుంటూనే అన్నతో గొడవలకు దిగాడు. వీరిద్దరు గత కొద్ది కాలంగా పలు ఈవెంట్స్‌లో పాల్గొన్న సమయాల్లో కౌంటర్లు వేసుకుంటున్నారు. గతంలో ఈ విషయం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇటీవల కాస్త గొడవలు తగ్గడంతో మంచు కుటుంబం కలిసిపోయారని అంతా భావించారు. ఈక్రమంలో.. తాజాగా, మంచు మనోజ్ ఓ సినిమా ఈవెంట్‌లో పాల్గొని విష్ణుకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు. "దేవుడా సైన్సా అని ఉంటుంది. మన దేవుళ్లు, మన పురాన కథలు రామాయణం తీసుకుంటే.. 7100 సంవత్సరాలకు ముందు వాల్మికి గారు రాసిన రామయణంలో చాలా వెర్షన్స్ వచ్చాయి. కానీ నేను మాత్రం ఫస్ట్ వెర్షన్ గురించి మాట్లాడుతున్నాను. దాంట్లో చాలావరకు సైన్స్‌కు సంబంధించిన విషయాలు ఉంటాయి. పుష్పక విమానం, ది ప్యాలెస్ కట్టడానికి కానీ దేవుడి గుడులు కట్టడాన్ని అన్నింటిలో సైన్స్ ఉంది. దేవుడు కనిపించకపోవడానికి కారణం మనలోనే ఉంటాడు అంటారు. ఒకడిని కష్టపెట్టి మనం ఎదగాలి అనుకుంటే మనలో ఉన్న రాక్షసుడు యాక్టివేట్ అవుతాడు. అలాంటి వారిని కర్మ వదిలిపెట్టదు. నువ్వు నిద్రపోతున్నా లేదా పడుకున్నా ఆ సమయంలో ఒకడు నిన్ను కొరుక్కుని తినేస్తాడు. పది కోసం నిలబడాలి.. పదిమందికి సాయం చేయాలి అనుకున్నప్పుడు దేవుడు మనతోనే ఉంటాడు ఆశీర్వదిస్తాడు.

## 'మైసా' స్పెషల్ గ్లింప్స్‌కు ముహూర్తం ఫిక్స్




నేషనల్ క్రష్ రష్మిక మందన్న 'పుష్ప 2' బ్లాక్ బస్టర్ సక్సెస్ తర్వాత ఆమె నుంచి రాబోతున్న మరో భారీ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'. ఈ సినిమాతో రవీంద్ర పూలే దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతుండటం విశేషం. ఇక ఇప్పటికే ఇందులోంచి విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రష్మిక ముఖంపై రక్తపు మరకలతో, చేతిలో ఆయుధం పట్టుకుని చాలా ఇంటెన్స్‌గా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. 'ఆమె గర్జన వినడానికి కాదు.. భయపెట్టడానికి' అనే ట్యాగ్ లైన్ సినిమాలోని యాక్షన్ ఏ రేంజ్‌లో ఉండబోతుందో తెలిసేలా చేసింది. అయితే ఈ చిత్రం తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో నివసించే 'గోండు' తెగల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతుందని సమాచారం. గోండు తెగల జీవన విధానం, వారి సాంప్రదాయాలు, కష్టాలు, పేదరికం, హక్కుల కోసం చేసే పోరాటం లాంటివన్నీ సినిమాలో అత్యంత రియలిస్టిక్‌గా చూపించనున్నారట. హక్కుల కోసం పోరాడే ఒక వీరనారిగా, పవర్‌ఫుల్ మదర్ క్యారెక్టర్‌లో రష్మిక కనిపించబోతున్నట్లు టాక్. నేషనల్ క్రష్ ఇంత వరకు ఇలాంటి రఫ్ అండ్ రగ్గడ్ పాత్ర చేయడం ఇదే మొదటిసారి కావడంతో, ఆమె ఫ్యాన్స్ మాత్రమే కాదు, ఇండస్ట్రీ మొత్తం కూడా ఆసక్తిగా ఈ సినిమా వైపు చూస్తోంది. రష్మిక పాత్ర కోసం ప్రత్యేకంగా ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లు ఇన్సైడ్ టాక్. షూటింగ్ మొత్తం తెలంగాణ అడవులు, నిజామాబాద్, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో జరగనుంది. సినిమా లొకేషన్స్ రియల్ వైబ్ ఇవ్వడానికి అక్కడి గిరిజన గ్రామాల్లో సెట్స్ వేయకుండా నేరుగా నేచర్‌లో షూట్ చేయబోతున్నారట. ఇక ఈ సినిమా నుంచి అప్డేట్స్ ఎప్పుడెప్పుడు వస్తాయా? అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను డిసెంబర్ 24, 2025న విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. అంతేకాకుండా ఓ పోస్టర్‌ను కూడా షేర్ చేశారు. ఇక ఇందులో రష్మిక చాలా పవర్ ఫుల్ లుక్‌లో కనిపించింది.


# 'అప్నీ హద్ సే' సాంగ్ లాంచ్ చేసిన ఎమ్మెల్యే



మహమ్మద్ నజీర్, రిఫత్ రజూర్ జంటగా నటించిన మెలోడియస్ మ్యూజిక్ వీడియో 'అప్నీ హద్ సే' హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో సినీ ప్రముఖుల మధ్య ఘనంగా విడుదలైంది. ఈ వేడుకకు జుబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గారు ముఖ్య అతిథిగా హాజరై, సాంగ్‌ను లాంచ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, యువ ప్రతిభను ప్రోత్సహించడం సంతోషంగా ఉందని, సౌత్ లో హిందీ సినిమా చేయటం చాలా మంచి పరిణామం ఈ సినిమా మరియు వీడియో సాంగ్ మంచి విజయం సాధించాలని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మ్యూజిక్ వీడియోలో మహమ్మద్ నజీర్ హీరోగా నటించగా, రిఫత్ రజూర్ హీరోయిన్‌గా మెరిశారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సాంగ్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బాలీవుడ్ ప్రముఖ గాయకుడు, 'ప్రియతమా' (మజిలీ) వంటి సూపర్ హిట్ సాంగ్స్ పాడిన అభయ్ జోధ్‌పుర్కర్ తన గాత్రంతో ఈ పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. అత్యున్నత నిర్మాణ విలువలతో, కళ్లకు రిచ్‌గా అనిపించే విజువల్స్‌తో ఈ వీడియో సాంగ్‌ను రూపొందించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన మహమ్మద్ నజీర్ .. "మా 'అప్నీ హద్ సే' సాంగ్ లాంచ్ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారికి మరియు అతిథులకు ధన్యవాదాలు. అభయ్ జోధ్‌పుర్కర్ వంటి గొప్ప సింగర్ మా పాట పాడటం మాకు గర్వకారణం. ప్రేక్షకులకు ఈ పాట కచ్చితంగా నచ్చుతుందని నమ్ముతున్నాను," అని తెలిపారు.

# మొదట పట్టించుకోలేదు.. కానీ



నేచురల్ స్టార్ నాని ఓ ఇంటర్వ్యూలో పాల్గొని ఆసక్తికర కామెంట్స్ చేశాడు. తనకు ఓ స్టార్ హీరో మెసేజ్ చేసినప్పటికీ పట్టించుకోలేదని..కానీ ఆ తర్వాత మర్చిపోలేని అనుభవం ఎదురైనట్లు చెప్పాడు. చియాన్ విక్రమ్ మాటలకు తాను ఫిదా అయిపోయినట్లు వారిద్దరి మధ్య జరిగిన ఓ సంఘటనను వెల్లడించాడు. "కొన్ని నెలల క్రితం, నాకు ఒక గుర్తు తెలియని నంబర్ నుండి 'విక్రమ్ గారు మీతో మాట్లాడాలనుకుంటున్నారు' అని ఒక మెసేజ్ వచ్చింది. అది గుర్తు తెలియని నంబర్ నుండి వచ్చినందున నేను ఆ మెసేజ్‌ను పట్టించుకోలేదు. మరుసటి రోజు, "హాయ్ నాని, నేను చియాన్ విక్రమ్‌ని ఇక్కడ" అని మెసేజ్ వచ్చింది.వెంటనే నేను నా మేనేజర్‌తో ఆ నంబర్‌ను సరిచూసుకుని కాల్ చేశాను. విక్రమ్ గారు కాల్ మాట్లాడి నాతో 10-15 నిమిషాలు మాట్లాడారు. మీరు నమ్మరు, ఆయన కేవలం నా గురించి, నా సినిమాల గురించే మాట్లాడారు. తాను నాకు పెద్ద అభిమానినని, నా కెరీర్ ప్రారంభం నుంచే నా పనులను అనుసరిస్తున్నానని చెప్పారు. నాకు చాలా బాగా అనిపించింది. ఆయన నా గురించి, నా కుటుంబం గురించి కూడా చాలా విషయాలు తెలుసుకున్నారు. ఇప్పుడు ఆయనతో నాకు ఒక ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడింది. దాని గురించి నేను చాలా చాలా సంతోషంగా ఉన్నాను" అని అన్నారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కాగా.. నాని సినిమాల విషయానికొస్తే.. ఇటీవల 'హిట్-3' మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. ప్రజెంట్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' చేస్తున్నారు. వీరిద్దరి కాంబోలో వచ్చిన 'దసరా' సూపర్ హిట్‌గా నిలవడంతో.. రెండు ప్రాజెక్ట్‌పై అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి. నాని, సోనాలి కులకర్ణి, మోహన్ బాబు, రాఘవ్ జుయల్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ మూవీని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇందులో నాని సరసన కయాదు లోహర్ నటిస్తున్నట్లు సమాచారం. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ %డ% స్పానిష్ భాషల్లో వచ్చే ఏడాది మార్చి 26న విడుదల కాబోతుంది.

# హీరో ప్రదీప్ రంగనాథన్ డైరెక్షన్‌లో కుర్ర హీరోయిన్



యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ డైరెక్టర్‌గా సత్తాచాటాడు. నటుడిగా నిరూపించుకున్నాడు. ఈ మధ్య వచ్చిన 'డ్యూడ్' సినిమాతో సక్సెస్ అందుకున్న ఆయన..ఫిబ్రవరిలో సినిమాతో మరోసారి ప్రేక్షకులను పలకరించబోతున్నాడు. అయితే తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను ఆయనే డైరెక్ట్ చేయబోతున్నట్లు కోలీవుడ్ టాక్. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై రాబోతున్న సినిమా సైన్స్ ఫిక్షన్‌గా ఉండబోతుందని.. విజువల్లీ గ్రాండ్‌గా ప్లాన్ చేస్తున్నారని టాక్. ఇక ఇప్పటికే తెలుగుతోపాటు హిందీ ఇండస్ట్రీలో ఆఫర్లు అందుకుంటున్న బ్యూటిఫుల్ మీనాక్షి చౌదరి ఇందులో హీరోయిన్‌గా నటించనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి అధికారిక ప్రకటన లేకుండానే ఈ సినిమా ట్రెండ్ అవుతుండగా.. ప్రదీప్ రంగనాథన్ మళ్లీ మెగా ఫోన్ పట్టడంపై ఫ్యాన్స్ హ్యాపీగా ఫీల్ అవుతున్నారు. ఆయన చిత్రాల్లో హీరోయిన్స్ సెలెక్షన్ అదిరిపోతుందనే కామెంట్స్ కూడా ట్రెండ్ అవుతుండటం విశేషం.

# జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో
# జర్నలిస్టుల నిరసన సక్సెస్

- అవినీతి అక్రమాలను ప్రశ్నించినందుకు జర్నలిస్టుల అరెస్టు తప్పలేదు - జిహెచ్ఎంసిలో విజిలెన్స్ అధికారులు అవినీతిని ప్రోత్సహిస్తున్నారా.?
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి - కమిషనర్ ను తప్పుతోవ పట్టిస్తున్న టౌన్ ప్లానింగ్ ఉన్నత అధికారులు
- మేము అవినీతి అక్రమాలు చేస్తే ఎవరు చర్యలు తీసుకోలేరని సవాల్ విసిస్తున్న సర్కిల్ అధికారులు
- అవినీతి అక్రమాలు చేసే అధికారులు సేఫ్.. ప్రశ్నించే జర్నలిస్టులకే బెదిరింపులు, అక్రమ కేసులు
- మార్పు రావాలి కాంగ్రెస్ రావాలి.. కాంగ్రెస్ వచ్చింది అవినీతి భారీగా పెరిగిపోయింది - అవినీతి అక్రమాలపై మా పోరాటం ఆగదు గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులు




**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను కట్టడి చేయాలని అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా జర్నలిస్టును బెదిరించడంతోపాటు దూషించిన ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు పై చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్టులు ఏకమై సోమవారం ఉదయం 11 గంటలకు జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ అవినీతి అక్రమాలపై రాసి రాసి అలసిపోతున్నామని ఉన్నత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో క్రింది స్థాయి ఉద్యోగులు, అధికారులు అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జోనల్ కమిషనర్లు, జిహెచ్ఎంసి కమిషనర్ చర్యలు



తీసుకోకుంటే ఇక ఎవరు చర్యలు తీసుకోవాలని ప్రశ్నించారు. ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు ఓ జర్నలిస్ట్ వివరణ కోరగా ఆయన బెదిరించడంతోపాటు, దూషించడం ఎంతవరకు సమంజసమని ఈ విషయం పై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇదే కాకుండా అక్రమ నిర్మాణాలపై వార్తలు రాస్తున్న రిపోర్టర్ల పై అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని అవినీతి అక్రమాలను కట్టడి చేయలేనప్పుడు మున్సిపల్ చట్టం ఎందుకని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలతో ఈరోజు గ్రేటర్ హైదరాబాద్ హస్తవ్యస్తంగా మారిందని భవిష్యత్తులో పెను ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. జిహెచ్ఎంసిలో విజిలెన్స్ విభాగం అసలు విధులు నిర్వహించడం లేదా.? అందుకోసమే అక్రమ నిర్మాణాలు ఇలా పెరిగిపోతున్నాయన్నారు. అవినీతి అక్రమాలకు సపోర్ట్ చేసే అధికారులకు ఉన్నంత సపోర్ట్ అవినీతి అక్రమాలను ప్రశ్నించే ప్రజలకు రిపోర్టర్లకు లేదన్నారు.

అక్రమాలు చేసి కోట్లు సంపాదించి ప్రశ్నించిన వారిపై అక్రమా కేసులు పెట్టడం ఆనవాయితీగా మారిందని దీనిపై స్పందించవలసిన ప్రతిపక్ష నాయకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉండి ఎవరికి ఉపయోగమని ప్రభుత్వాన్ని ప్రజల ప్రక్షాళన ప్రశ్నించ లేనప్పుడు మరి ప్రతిపక్ష నాయకులు ఎలా అవుతారో వాళ్ళ విజ్ఞతకే తెలియాలి అన్నారు. ఈరోజు రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది జర్నలిస్టులేనని ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు అవినీతి అక్రమాలను ప్రశ్నించి అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### జర్నలిస్టుల అరెస్ట్..

జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులను అరెస్టు చేసి సైఫాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. జిహెచ్ఎంసిలో కోట్లల్లో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని నిరసన వ్యక్తం చేసిన జర్నలిస్టులను అరెస్టు చేయడం సమంజసం కాదని దీనిపై ప్రభుత్వం స్పందించి వెంటనే పూర్తిస్థాయి విచారణ చేపించాలని ముఖ్యంగా ఏసీబీ అధికారులచే టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ అధికారుల తో పాటు డిప్యూటీ కమిషనర్ల అవినీతిపై ఏసీబీ విచారణ చేయాలని జర్నలిస్టులు కోరారు.

### అరెస్టులు ఖండిస్తున్నాం.. తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం..

### భాగ్యనగర్ జర్నలిస్టు అసోసియేషన్..

అవినీతి అక్రమాలను కట్టడి చేయమన్నందుకు జర్నలిస్టులను అరెస్టు చేయడం ఏమిటని తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆనంచిన్ని వెంకటేశ్వరరావు, భాగ్యనగర్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం గౌడ్ ప్రశ్నించారు. మరి అధికారులు అవినీతి అక్రమాలు చేస్తే ఎవరు ప్రశ్నించాలని ప్రతిపక్షాలు చేయవలసిన బాధ్యత జర్నలిస్టులు చేస్తే ప్రభుత్వం ఎందుకు ఉలిక్కి పడుతుందని ప్రశ్నించారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టిన జర్నలిస్టులను అరెస్టు చేసిన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ప్రభుత్వానికి చేతనైతే జర్నలిస్టులు రాసిన సమస్యలపై అవినీతి అక్రమాలపై ప్రభుత్వ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు.

# మల్కాజిగిరిలో 'అక్రమ' దందా

## - వంద గజాల్లో మూడంతస్తులు - నోటీసులతోనే సరిపెడుతున్న అధికారులు
## - అక్రమ నిర్మాణాలను పెంచి పోషిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు





మల్కాజిగిరి(ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి మున్సిపల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు ఏమాత్రం తగ్గడం లేదు. నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా సాగుతున్న నిర్మాణాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం 'నోటీసుల'కే పరిమితమవుతున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో కూల్చివేతలు చేపట్టకుండా నోటీసులతో కాలయాపన చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణ ప్రణాళిక నిబంధనల ప్రకారం వంద గజాల లోపు స్థలంలో బహుళ అంతస్తుల నిర్మాణానికి అనుమతి లేదు. కానీ మల్కాజిగిరిలోని అనేక కాలనీల్లో వంద గజాల చిన్నపాటి స్థలాల్లోనే మూడు నుండి నాలుగు అంతస్తులను నిర్మిస్తున్నారు. కనీసం సెట్ బ్యాక్స్ వదలకుండా గల్లీలను ఆక్రమిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. టౌన్ ప్లానింగ్ అధికారుల కళ్లెదుటే ఇన్ని అక్రమ కట్టడాలు వెలుస్తున్నా, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఆర్థిక లావాదేవీలు బాగానే జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఒల్డ్ నేరేడ్మేట్ బొడ్రాయి సమీపంలో వందగజల్లోనే మూడంతస్తుల నిర్మాణం కొనసాగుతుందని మున్సిపల్ అధికారులు ఫిర్యాదులు అందినా చూసి చూడనట్లు వ్యవహరించడం, ఓ గల్లి నాయకుడే ఇక్కడి అక్రమ నిర్మాణంపై చక్రం తిప్పుతున్నట్లు స్థానికుల మండిపడుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది లక్షల్లో వసూలు చేసి సదరు నిర్మాణదారుడికే చుక్కలు చూపిస్తున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అక్రమ నిర్మాణాల వద్ద అధికారులు లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఒక్కో అంతస్తుకు ఇంత అని రేటు నిర్ణయించి, ముందస్తుగా 'ముడుపులు' ముట్టాకే పనులకు పచ్చజెండా ఊపుతున్నారని సమాచారం. భవన యజమానుల వద్ద నుండి భారీగా వసూళ్లు చేస్తూ, ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయానికి గండి కొడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు.నోటీసులు కేవలం 'కంటితుడుపు' కోసమేనా.?అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే, అధికారులు వెంటనే నోటీసులు జారీ చేస్తారు. అయితే ఆ నోటీసులు కేవలం రికార్డుల కోసమే తప్ప, నిర్మాణాలను అడ్డుకోవడానికి కాదని ఏసిపి బాల శ్రీనివాస్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా నిర్మాణాలు ఆగకుండా చకచకా పూర్తవుతుండటమే దీనికి నిదర్శనం. నోటీసుల పేరుతో యజమానులను బెదిరించి, మరిన్ని వసూళ్లకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరుకైన సందుల్లో ఇలాంటి భారీ నిర్మాణాలు చేపట్టడం వల్ల అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు గానీ, ఇతర అత్యవసర సమయాల్లో గానీ సహాయక చర్యలు చేపట్టడం అసాధ్యంగా మారుతోంది. డ్రైనేజీ పైపులు, మంచినీటి కనెక్షన్లపై అదనపు భారం పడి కాలనీల్లో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు స్పందించి, మల్కాజిగిరిలో అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, నోటీసుల నాటకానికి స్వస్తి పలికి కఠినమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మాస్కోలో కారు బాంబు దాడి

## - రష్యాకు చెందిన కీలక జనరల్ మృతి



మాస్కో (ప్రశ్న న్యూస్) మాస్కోలో జరిగిన కారు బాంబు దాడిలో కీలక రష్యా సైనిక జనరల్ ఒకరు మృతి చెందారు. ఈ విషయాన్ని రష్యా దర్యాప్తు సంస్థ వెల్లడించింది. రష్యా సాయుధ దళాల జనరల్ స్టాఫ్‌కు చెందిన ఆపరేషనల్ ట్రైనింగ్ డైరెక్టర్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్, బాంబు దాడి ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో మరణించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఆయన కారు కింద అమర్చిన పరికరం పేలడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. అపార్టుమెంట్ దగ్గర కారు పార్కింగ్ ప్రాంతంలో జరిగిన ఈ దాడి వెనుక ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ హస్తం ఉన్నట్లు రష్యా అధికారులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. గత మూడేళ్లుగా రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ యుద్ధాన్ని ఆపేందుకు వివిధ దేశాలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉద్రిక్తతలు మాత్రం తగ్గడం లేదు. ఇటీవల కాస్పియన్ సముద్రంలోని రష్యా కీలక చమురు క్షేత్రంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు నిర్వహించింది. మున్ముందు మరిన్ని దాడులు చేస్తామని కూడా హెచ్చరించింది.?

# నగర వాసులకు తీపి కబురు

## - ఆస్తి పన్ను చెల్లింపులో 90 శాతం రాయితీ




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఆస్తి పన్నుకు సంబంధించి సోమవారం ఒక ముఖ్యమైన ప్రకటన విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను చెల్లింపులపై వన్ టైమ్ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. బకాయిలను ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 90 శాతం వరకు రాయితీ పొందవచ్చని నగరవాసులకు శుభవార్తను అందించింది. ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆస్తుల పెండింగ్ బకాయిలపై ఈ రాయితీ ఇవ్వబడుతుంది. వినియోగదారులు కేవలం ఆస్తి పన్నులో వడ్డీని 10 శాతం చెల్లిస్తే సరిపోతుందని జీహెచ్ఎంసీ తెలిపింది. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని రకాల ప్రైవేటు మరియు ప్రభుత్వ ఆస్తులకు ఈ రాయితీ వర్తిస్తుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలియజేశారు.

### వారికీ వర్తింపు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిని విస్తరించిన విషయం తెలిసిందే. 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. జీహెచ్ఎంసీలో విలీనమైన ప్రాంతాలకు కూడా ఈ ప్రత్యేక రాయితీ వర్తిస్తుంది. ఈ రాయితీ ద్వారా ప్రజలపై భారం తగ్గడంతో పాటు జీహెచ్ఎంసీకి గణనీయమైన ఆదాయం సమకూరే అవకాశం ఉంది.?

## పెట్టుబడులు రావొద్దన్నట్లుగా
# కేసీఆర్ మాట్లాడారు

## - ఒప్పందాలను తక్కువ చేసి మాట్లాడారని విమర్శ



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు రావొద్దన్నట్లుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిన్న మాట్లాడారని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ఇటీవల గ్లోబల్ సమ్మిట్‌లో జరిగిన ఒప్పందాలను మాజీ ముఖ్యమంత్రి తక్కువ చేసి మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుభవం కలిగిన నాయకుడిగా రాష్ట్ర అభివృద్ధికి ఆయన సూచనలు చేస్తారని తాము భావించామని, కానీ అందుకు భిన్నంగా పెట్టుబడులకు వ్యతిరేకంగా మాట్లాడారని విమర్శించారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఉద్యోగాలు రావొద్దని బీఆర్ఎస్ నాయకత్వం కోరుకుంటున్నట్లుగా ఉందని ఆరోపించారు. గ్లోబల్ సమ్మిట్ వేదికగా లక్షల కోట్ల రూపాయల ఎంవోయూలు కుదిరాయని ఆయన అన్నారు. ఒప్పందం చేసుకున్న ప్రతి సంస్థ ఇక్కడ పరిశ్రమ ఏర్పాటు చేసేలా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కూడా ఒప్పందం చేసుకున్న ప్రతి పరిశ్రమ రాలేదని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు.అప్పుడు తాము కూడా దానిపై రాజకీయం చేయలేదని అన్నారు. ఏ రాష్ట్రంలో లేనంత స్థాయిలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించామని అన్నారు. హైదరాబాద్ నగరానికి వచ్చేందుకు ఎన్నో అంతర్జాతీయ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఒక్క ఏడాదిలోనే 75 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను తీసుకువచ్చామని అన్నారు. అత్యధిక జీసీసీలు వచ్చిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని వెల్లడించారు. గత ఏడాది రాష్ట్రానికి రూ. 3.40 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. కొత్త పెట్టుబడులతో 1.40 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో ఎన్నో ప్రభుత్వ సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రపంచ అవసరాలలో మూడొంతుల వ్యాక్సిన్లు హైదరాబాద్ నుంచే ఎగుమతి అవుతున్నాయని శ్రీధర్ బాబు తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588